
Follow: @ANNTELUGU
28-08-2026
# మహా పత్రిక
ANN తెలుగు
శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 233 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM




## తెలంగాణలో 'సెన్సస్–2027'కు రంగం సిద్ధం

- ఆగస్టు 29న గెజిట్ నోటిఫికేషన్
- ప్రతి వ్యక్తిపై 40 రకాల వివరాల సేకరణ
- కులం, మతం నుంచి వలసలు, విద్య, వృత్తి వరకు సమగ్ర సమాచారం

హైదరాబాద్, మహా : తెలంగాణలో సెన్సస్-2027 నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. జనగణనకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను మరోసారి ప్రచురించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఆగస్టు 29న తెలంగాణ గెజిట్‌లో జనగణన నోటిఫికేషన్‌ను ప్రచురించనున్నారు. దేశవ్యాప్తంగా చేపట్టనున్న జనగణనలో భాగంగా ప్రజలకు సంబంధించిన విస్తృత సమాచారాన్ని సేకరించేందుకు కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసిన నేపథ్యంలో రాష్ట్రంలోనూ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నారు. సెన్సస్-2027లో భాగంగా ప్రతి వ్యక్తికి సంబంధించిన ప్రాథమిక వివరాలతో పాటు సామాజిక, విద్యా, వృత్తి,

మిగతా 3వ పేజీలో

టాప్ న్యూస్

### డీలిమిటేషన్‌పై ఏకపక్ష నిర్ణయాలు వద్దు

- అఖిలపక్ష భేటీ పెట్టండి: మోదీకి ఖర్గే లేఖ
- 543 లోక్‌సభ స్థానాలు మరో 25 ఏళ్లు మార్చొద్దు



03

### మళ్ళీ మోదీనే


- ఇపుడు ఎన్నికలు జరిగితే 326సీట్లు
- జనవరి సర్వేతో పోలిస్తే 26సీట్ల తగ్గుదల
- ఇండియా టుడే మూడ్ ఆఫ్ దినేషన్ సర్వే



02

### రేవంత్ రెడ్డి పాలిటిక్స్ లో.. అల్లు అర్జున్ సినిమాల్లో ఇద్దరూ బుల్లెట్ ట్రైన్లే

అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు!



02

# అధికారుల బరితెగింపు..!



## శంషాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అరాచకం..!

- రింగయిన జీహెచ్ఎంసీ, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు..!
- అక్రమార్కుల కనుసన్నల్లో అధికార యంత్రాంగం..!
- నాలా కన్వర్షన్ లేకుండానే యథేచ్ఛగా రిజిస్ట్రేషన్లు..!
- షెడ్డు కూడా లేని చోట 84 విల్లాలకు పీటీఐఎన్, ఇంటి నెంబర్ల జారీ..!
- అక్రమ మార్గంలో డెవలప్మెంట్ అగ్రిమెంట్లు..!
- పత్తాలేని ఆడిట్ అధికారులు..!
- మౌనం వహిస్తున్న రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్..!

- డిసెంబర్ నుంచి జనవరి 20 వరకు నమోదైన డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి..!
- డాక్యుమెంట్ నెం. 197/2026, 372/2026 లను వెంటనే రద్దు చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్థానికుల డిమాండ్..!
- జూనియర్ అసిస్టెంట్ నజీరుద్దీన్, ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ వికాస్ రెడ్డి ఇరువుని సస్పెండ్ చేయాలి...!
- అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికుల విజ్ఞప్తి..!

02




శంషాబాద్ సర్కిల్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలలో అరాచకం రాజ్యమేలుతోంది. జీహెచ్ఎంసీలో బిల్ కలెక్టర్ మొదలుకొని డిప్యూటీ కమిషనర్ వరకు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్, అప్పటి ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్లు రియల్ మాఫియాతో కుమ్మక్కై అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారనే విమర్శలు బహిరంగంగానే వ్యక్తమవుతున్నాయి.జీఓ 111 ఎం.ఎ, రిజిస్ట్రేషన్ జీఓ 257 నిబంధనలకు పాతరేసి, నాలా కన్వర్షన్ అనే కనీస నిబంధనను సైతం తుంగలో తొక్కారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి . షెడ్డు కూడా లేని చోట ఏకంగా 84 కల్పిత విల్లాలకు పీటీఐఎన్‌లు, ఇంటి నంబర్లు కేటాయించి యథేచ్ఛగా రిజిస్ట్రేషన్లు నిర్వహించి అక్రమ దందాకు తెగబడ్డారని స్థానికులు పేర్కొంటున్నారు.వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా చూపిస్తూ డెవలప్మెంట్ అగ్రిమెంట్లు, రిజిస్ట్రేషన్లు నిర్వహించడం ద్వారా భారీ స్థాయిలో అక్రమ ధనార్జనకు పాల్పడినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన ఆడిట్ డిపార్ట్మెంట్, రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ పత్తా లేకుండా పోయారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.




## మీరాలం చెరువులో వాటర్ స్పోర్ట్స్, ఐ ల్యాండ్

- చెరువు రూపురేఖలు మార్చేందుకు సీఎం ఆదేశాలు
- ఆకస్మిక తనిఖీతో సర్ ప్రైజ్
- సస్పెన్షన్ బ్రిడ్జితో అంతర్జాతీయ పర్యాటక ఆకర్షణ

హైదరాబాద్, మహా : హైదరాబాద్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం ఉదయం మీరాలం చెరువును ఆకస్మికంగా పరిశీలించారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చెరువు పరిసరాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆయన స్వయంగా పరిశీలించి, పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. భారీ క్రేన్‌పై నుంచి చెరువు పరిసరాలను పరిశీలించిన సీఎం మీరాలం చెరువుపై నిర్మిస్తున్న సస్పెన్షన్ బ్రిడ్జిపనులను పరిశీలించారు. వంతెన నిర్మాణంతోపాటు చుట్టుపక్కల చేపడుతున్న మౌలిక వసతుల అభివృద్ధి, భవిష్యత్‌లో అందుబాటులోకి రానున్న సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్ణీత గడువులోగా నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మీరాలం చెరువులోకి మురుగునీరు చేరకుండా పటిష్టమైన చర్యలు

మిగతా 3వ పేజీలో



### ఫలించిన సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నం

- ప్రాణహితపై ముందడుగు
- సెప్టెంబర్ 1న ఢిల్లీలో తెలంగాణ, మహారాష్ట్రల కీలక భేటీ

హైదరాబాద్, మహా : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతర ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. ప్రాణహిత నదిపై తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక, అంతర్రాష్ట్ర అంశాలపై సెప్టెంబర్ 1న ఢిల్లీలో కీలక సమావేశం జరగనుంది.

మిగతా 3వ పేజీలో

## శాన్వీ ప్రాపర్టీస్ అరాచకం..!

తూములు, నాలాలు మూసి లేఅవుట్ నిర్మాణం...!

- అడ్డదారిలో హెచ్ఎండీఏ అనుమతులు...!
- నోట్ల కట్టలతో నోళ్లు మూయించిన రియల్టర్లు...!
- ఆమ్యామ్యాలతో సరేనన్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు...!
- వెంకట సాయి నగర్ పేరుతో అన్నోజిగూడ కేంద్రంగా రియల్ దందా...!

02




ఘట్‌కేసర్ సర్కిల్, అన్నోజిగూడ వెంకటసాయి నగర్‌లో శాన్వీ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్ రియల్టర్ల అరాచకం రాజ్యమేలుతోంది. ఎల్లప్పుడూ జీవనదిలా ప్రవహించే నాలాలు, తూములను మూసివేసి నిర్మాణ సంస్థ అడ్డదారుల్లో హెచ్‌ఎండీఏ అనుమతులు పొంది అక్రమ దందా సాగిస్తోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి . రియల్ మాఫియా నోట్ల కట్టలతో నోళ్లు మూయించడంతో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు జాయింట్ సర్వే చేయకుండానే కళ్లు మూసుకుని ఎన్‌ఓసీలు జారీ చేశారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. హెచ్‌ఎండీఏ అధికారులు సైతం క్షేత్రస్థాయిలో పరిశీ



లించకుండానే లేఅవుట్ అనుమతులు ఇచ్చారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెరువులు, నాలాలు, బఫర్ జోన్లు, ఎఫ్‌టీఎల్ పరిధులను పరిగణనలోకి తీసుకోకుండా అడ్డగోలుగా నిర్మాణ అనుమతులు జారీ చేయడంతో భావితరాలకు నీటి వనరులు కరువయ్యే పరిస్థితి నెలకొంటుందని బహిరంగ ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.



# అధికారుల బరితెగింపు..!

**మహా, స్టేట్ బ్యూరో చీఫ్:**

రంగారెడ్డి జిల్లా, శంషాబాద్ మండలంలో ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి, రిజిస్ట్రేషన్ చట్టాలను అక్రమార్కుల కాళ్ల వద్ద తాకట్టు పెడుతూ కొందరు అధికారులు సాగిస్తున్న అక్రమ రిజిస్ట్రేషన్ల దందా శంషాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో కలకలం రేపుతోంది. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి అత్యంత సమీపంలో ఉన్న ప్రాంతం కావడంతో భూముల విలువలు కోట్లలో పలుకుతుండటంతో, అక్రమార్కులతో చేతులు కలిపిన అధికారులు కాసుల కక్కుర్తితో బరితెగించి వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీఓ-111 ఎం.ఎ నిబంధనలతో పాటు రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన జీఓ-257 మార్గదర్శకాలను సైతం పక్కనపెట్టి వ్యవహరించారనే అభ్యంతరాలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్పిడి (నాలా కన్వర్షన్) చేయకుండానే, కనీసం పునాదులు కూడా లేని ఖాళీ స్థలాల్లో విల్లాలు వెలిసినట్లు కాగితాల్లో సృష్టించి కోట్లాది రూపాయల రిజిస్ట్రేషన్ల పర్వానికి తెరలేపారు. ఈ భారీ కుంభకోణంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లోని (జీహెచ్ఎంసీ) బిల్ కలెక్టర్ తో పాటు డిప్యూటీ కమిషనర్ వరకు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది ఒకరికొకరు తోడై 'రింగ్'గా ఏర్పడి అక్రమాలకు పాల్పడటం గమనార్హం.

**నాలా కన్వర్షన్ లేదు.. జీవో 111 ఎం.ఎ కు పాతర.. జీవో 257 మాయం!**

ఏదైనా ఒక వ్యవసాయ భూమిని నివాస స్థలాలుగా మార్చాలన్నా ప్రభుత్వానికి అవసరమైన ఫీజులు చెల్లించి 'నాలా కన్వర్షన్' సర్టిఫికెట్ పొందడం తప్పనిసరి. దీనికి తోడు పర్యావరణ పరిరక్షణ కోసం, జంట జలాశయాల రక్షణ కోసం ప్రభుత్వం జారీ చేసిన అత్యంత కీలకమైన జీవో 111 పరిధిలోని నిషేధ ఆంక్షలను ఇక్కడి అధికారులు పూర్తిగా తుంగలో తొక్కారు. బయోకన్జర్వేషన్ జోన్లలో లేఅవుట్లు, బహుళ అంతస్థుల నిర్మాణాలు, భారీ కట్టడాలపై నిషేధాజ్ఞలు అమలులో ఉన్నప్పటికీ, నిబంధనలను బూడిదలో పోసిన పన్నీరు చేస్తూ రిజిస్ట్రేషన్లు కానిచ్చేశారు. అంతేకాకుండా, అక్రమ లేఅవుట్లు, అనుమతులు లేని ప్లాట్ల రిజిస్ట్రేషన్లపై కఠిన నిబంధనలు విధించే జీవో 257 లోని లేఅవుట్ ప్లానింగ్ నిబంధనలను సైతం అధికారులు అడ్డగోలుగా ఉల్లంఘించారు. అధీకృత ప్లానింగ్ సంస్థల అనుమతి పత్రాలు లేకుండా, రిజిస్ట్రేషన్ చట్టాలను తుంగలో తొక్కుతూ అక్రమ మార్గంలో డెవలప్మెంట్ అగ్రిమెంట్లు చకచకా సాగిపోతుండటం ఇక్కడి అవినీతి అక్రమాలకు అద్దం పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**షెడ్డు కూడా లేని చోట 84 విల్లాలు.. రాకేశ్ కుమార్ గార్గ్, ఆర్.కె.మైత్రి భాగస్వామ్యం!**

అక్రమాలకు పరాకాష్టగా, క్షేత్రస్థాయిలో కనీసం ఒక చిన్న షెడ్డు కూడా లేని ఖాళీ స్థలంలో ఏకంగా 84 విల్లాలు నిర్మించినట్లు కాగితాల్లో చూపించారు. దీనికి జీహెచ్ఎంసీ అధికారులు సైతం వత్తాసు పలుకుతూ, ఎటువంటి తనిఖీలు చేయకుండానే ట్యాక్స్ అసెస్మెంట్ కింద పీటీఐఎన్ నెంబర్లు, ఇంటి నెంబర్లు జారీ చేసేశారు. లభ్యమైన అధికారిక డాక్యుమెంట్స్, ఈసీ రికార్డుల ప్రకారం.. తొండుపల్లి పరిధిలోని సర్వే నంబర్లు 211, 212 లలో గల 26,124 చదరపు గజాల విస్తీర్ణంలో కనీసం ఇటుక ముక్క కూడా పెట్టకుండానే.. హౌస్ నెంబర్లు 281/1/A1 నుండి 281/84/A1 వరకు ఏకంగా 84 ప్లాట్లకు ఇళ్లను నిర్మించినట్లుగా ( 3,78,924 చదరపు అడుగులు) కాగితాలపై సృష్టించారు. ఈ నెంబర్ల ఆధారంగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో మార్కెట్ వాల్యూ రూ. 41.68 కోట్లుగా చూపిస్తూ అక్రమ మార్గంలో డెవలప్మెంట్ అగ్రిమెంట్లు చకచకా రిజిస్టర్ అయినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఈ అక్రమ ఒప్పందంలో ఎగ్జిక్యూటెంట్లుగా రాకేశ్ కుమార్ అలియాస్ రాకేశ్ గార్గ్, సంజయ్ కుమార్, నంద్ కిషోర్ అగర్వాల్, అశోక్ కుమార్ గార్గ్ ఉండగా, క్లెయిమెంట్‌గా ఎం/ఎస్. ఆర్.ఆర్. కె. మైత్రి తరపున అధీకృత భాగస్వాములు రాపోలు కృష్ణకుమారి, డాక్టర్ ప్రకాశ్ బాబు వేగుంట వ్యవహరించడం గమనార్హం.




**197/2026 నంబర్ డాక్యుమెంట్‌లో దారుణం.. సంబంధం లేని సర్వే నంబర్ల లింక్ డాక్యుమెంట్లు వాడకం!**

ఈ రిజిస్ట్రేషన్ బాగోతంలో జరిగిన సంచలన అక్రమాలకు సంబంధించిన అధికారిక డాక్యుమెంట్స్, ఈసీ ఆధారాలు 'మహా పత్రిక' చేతికి చిక్కాయి. జనవరి 07, 2026 న నమోదైన వివాదాస్పద డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ కమ్ జీపీఏ (డాక్యుమెంట్ నెం. 197/2026) లో అధికారులు చేసిన దారుణం అంతా ఇంతా కాదు. తొండుపల్లి సర్వే నంబర్లు 211, 212 లలో గల భూమికి సంబంధించి అగ్రిమెంట్ రాస్తూ, దానికి ఏమాత్రం పొంతన, సంబంధం లేని వేరే గ్రామానికి చెందిన సర్వే నంబర్ల లింక్ డాక్యుమెంట్లు యథేచ్ఛగా వాడేశారు. ఈ డాక్యుమెంట్‌కు ఆధారంగా చూపిన లింక్ డాక్యుమెంట్లలో తడ్లపల్లె (తాళ్లపల్లి) పరిధిలోని సర్వే నంబర్ 283/ఎ5 కి సంబంధించిన డాక్యుమెంట్ నెంబర్ (5015/2016) ఉండటం గమనార్హం. వేరే ప్రాంతానికి చెందిన, ఏమాత్రం సంబంధం లేని సర్వే నంబర్ల లింక్ డాక్యుమెంట్లు పెట్టినా కూడా కళ్లు మూసుకుని రిజిస్ట్రేషన్ పూర్తి చేశారంటే ఇక్కడ అధికారుల హస్తం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.


**డాక్యుమెంట్ నెం. 372/2026 లో నకిలీ ఎల్ఆర్ఎస్ మాయాజాలం.. 'మహా' చేతిలో ఆధారాలు!**


ఇదే క్రమంలో పెద్దషాపూర్ పరిధిలోని సర్వే నంబర్ 241/^సి లో గల 20 గుంటల వ్యవసాయ భూమికి సంబంధించి జనవరి 16, 2026 న నమోదైన డాక్యుమెంట్ నెం. 372/2026 వెనుక ఉన్న 'ఎల్ఆర్ఎస్' కుంభకోణం తాలూకు లీక్డ్ పేమెంట్ రశీదు ఆధారాలు 'మహా పత్రికకు'కు లభ్యమయ్యాయి. ఈ పత్రాలను పరిశీలిస్తే అక్రమార్కులు, రిజిస్ట్రేషన్ అధికారులు కలిసి ప్రభుత్వ ఖజానాను ఎలా నిలువునా ముంచారో స్పష్టమవుతోంది.


కలీన తేజస్వి పేరిట ఉన్న ఈ ఎల్ఆర్ఎస్ దరఖాస్తు (అప్లికేషన్ నెంబర్ : జి/RSPR/001975/2020) లో 14% ఓపెన్ స్పేస్ ఛార్జీల కింద ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ. 5,33,610/ పైసలను అసలు చెల్లించనే లేదు. ప్రభుత్వానికి రావలసిన లక్షలాది రూపాయల ఫీజులను ఎగ్గొట్టి , ఈ రశీదును అడ్డం పెట్టుకుని రిజిస్ట్రేషన్ కానిచ్చేశారు. కంప్యూటరైజ్డ్ రశీదుపై స్పష్టంగా నోట్ (ii) లో "ఈ రశీదు కేవలం అప్లికేషన్ ఫీజు చెల్లింపునకు సంబంధించింది మాత్రమే.. ఇది క్రమబద్ధీకరణకు ఎలాంటి హక్కులను కల్పించదు" అని రాసి ఉంది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తు ఇంకా పరిశీలనలోనే ఉందని, తుది అనుమతి రాలేదని ఈ రశీదు స్పష్టం చేస్తోంది. అయినప్పటికీ శంషాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు (నజీరుద్దీన్, వికాస్ రెడ్డి) ఈ తాత్కాలిక రశీదునే ఫైనల్ క్లియరెన్స్ సర్టిఫికేట్‌గా పరిగణించి డాక్యుమెంట్ 372/2026 ను రిజిస్టర్ చేయడం వారి బరితెగింపునకు నిదర్శనం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తిస్థాయి ఎల్ఆర్ఎస్ ఆర్డర్ కాపీ ఉంటేనే రిజిస్ట్రేషన్ చేయాలి. కానీ, ఇక్కడ ఓపెన్ స్పేస్ ఛార్జీలు చెల్లించని, క్రమబద్ధీకరణ హక్కులు లేని ఒక దరఖాస్తు రశీదును చూపిస్తూ.. ఎం/ఎస్. సిండికేట్ హౌసింగ్ అండ్ డెవలపర్స్ భాగస్వామి చిట్టేడి నారాయణ రెడ్డి ద్వారా ఈ దందాను సాగించారు.

**పత్తాలేని ఆడిట్ అధికారులు.. జిల్లా రిజిస్ట్రార్ మౌనం..!**

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రతి నెలా జరిగే లావాదేవీలను, రిజిస్ట్రేషన్లను క్షుణ్ణంగా పరిశీలించాల్సిన ఆడిట్ అధికారులు ఈ వ్యవహారంలో పూర్తిగా కళ్లు మూసుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కంటితుడుపు తనిఖీలతో కాలం వెళ్లదీస్తూ అక్రమార్కులకు పరోక్షంగా సహకరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, ఈ అరాచకాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నప్పటికీ, రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ దీనిపై మౌనం వహించడం పలు అనుమానాలకు తావిస్తోంది. గత రెండు రోజులుగా ఈ వ్యవహారానికి సంబంధించిన కథనాలు వెలువడుతున్నప్పటికీ జిల్లా రిజిస్ట్రార్ ఎలాంటి చర్యలకు ఉపక్రమించకపోవడంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంలో ఏవైనా రాజకీయ ఒత్తిళ్లు లేదా ఇతర ప్రభావాలు పనిచేస్తున్నాయా అనే సందేహాలను కూడా వారు వ్యక్తం చేస్తున్నారు.









**ఆ రెండు డాక్యుమెంట్లు వెంటనే రద్దు చేయాలి**

2025 డిసెంబర్ 1వ తేదీ నుండి 2026 జనవరి 20 వ తేదీ వరకు శంషాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నమోదైన ప్రతి డాక్యుమెంట్‌ను క్షుణ్ణంగా పరిశీలిస్తే ఇలాంటి వందలాది అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా అక్రమ మార్గంలో నిబంధనలకు విరుద్ధంగా, జీవోలను తుంగలో తొక్కి, తప్పుడు లింక్ డాక్యుమెంట్లు, హక్కులు లేని ఎల్ఆర్ఎస్ రశీదులతో రిజిస్టర్ చేయబడినట్లు చెబుతున్న డాక్యుమెంట్ నెం. 197/2026, డాక్యుమెంట్ నెం. 372/2026లను వెంటనే రద్దు చేసి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్థానికులు తీవ్రస్థాయిలో డిమాండ్ చేస్తున్నారు.



197/2026 కు సంబంధం లేని తాడ్లపల్లె లింక్ డాక్యుమెంట్




నకిలీ ఎల్ ఆర్ ఎస్

**ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు వేయాలి : స్థానికుల డిమాండ్ :**

ఈ అవినీతి బాగోతంలో కీలక సూత్ర, పాత్రధారులుగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ నజీరుద్దీన్, ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్ వికాస్ రెడ్డిలను తక్షణమే విధుల్లోంచి తొలగించి (సస్పెండ్ చేసి), వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్థానికులు, బాధితులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, శంషాబాద్ కార్యాలయంలో జరిగిన ఈ భారీ విల్లా ప్రాజెక్ట్ రిజిస్ట్రేషన్ల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ, ఐజీ, విజిలెన్స్, ఏసీబీ దర్యాప్తు జరగాలి:**

ఈ వ్యవహారాన్ని కేవలం జిల్లా స్థాయి విచారణకే పరిమితం చేయకుండా, రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ, ఐజీ స్థాయి అధికారులతో పాటు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)లు రంగంలోకి దిగి సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా రిజిస్ట్రేషన్ జీవో 257కు విరుద్ధంగా 2025 డిసెంబర్ నెల నుంచి 2026 జనవరి 20వ తేదీ వరకు శంషాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన అన్ని రిజిస్ట్రేషన్లపై సమగ్ర విచారణ చేపడితే మరిన్ని అక్రమ రిజిస్ట్రేషన్లు, నిబంధనల ఉల్లంఘనలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. అందువల్ల ఆ 50 రోజులకు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లను ప్రత్యేక బృందంతో పరిశీలించి, అక్రమాలు నిర్ధారణ అయితే సంబంధిత పత్రాలను రద్దు చేయడంతో పాటు బాధ్యులపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకుని ప్రజల ముందు నిజానిజాలను వెల్లడించాలని వారు కోరుతున్నారు.


---

# శాన్వీ ప్రాపర్టీస్ అరాచకం..!

**మహా, సిటీ బ్యూరో :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ సర్కిల్, అన్నోజిగూడ వెంకటసాయి నగర్‌లో రియల్ మాఫియా అరాచకం సృష్టిస్తోంది. అన్నోజిగూడ వెంకటసాయి నగర్ సర్వే నంబర్లు 36/పి, 37/పి, 38/పి, 40/పి లలో శాన్వీ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో నాలాను మూసివేసి హెచ్ఎండీఏ నుంచి రియల్టర్లు అనుమతులు పొందారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాలాలు ఉంటే ఓపెన్‌గా (తెరిచి) నాలా వెడల్పును బట్టి బఫర్ జోన్‌ను నిర్ణయిస్తారు. కానీ నోట్ల కట్టలతో హెచ్ఎండీఏ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారుల నోళ్లు మూయించిన సదరు రియల్టర్లు అడ్డదారిలో లేఅవుట్ అనుమతులు పొందారని వారు ఆక్షేపిస్తున్నారు. బంధం కుంట నుంచి మొదలైన వరద ప్రవాహం ఘట్‌కేసర్ ఆర్ఎస్ఎస్ స్కూల్, జైపూర్ కాలనీ మీదుగా, లేఅవుట్ మధ్య నుంచి ప్రవహించి నారాయణ చెరువులో కలుస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు. అయినప్పటికీ సదరు అధికారులు లేఅవుట్ అనుమతులు ఎలా జారీ చేస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. సహజంగా ప్రవహించే నీటి వనరులకు అడ్డుకట్ట వేస్తే ఇరిగేషన్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయి. కానీ రియల్ మాఫియా చట్టాలను పక్కనే ఉన్న నారాయణ చెరువులో బొంద పెట్టి లేఅవుట్‌లో విక్రయాలు జరపడంపై స్థానికులు మండిపడుతున్నారు. రియల్ మాఫియా నాలాపై ముప్పై అడుగుల సీసీ రోడ్లు వేసి, నాలాపై స్లాబ్ వేయడంతో ఉద్ధృతంగా ప్రవహించే వరద నీరు పోయే దారి లేక ఎగువ ప్రాంతాలు కూడా నీట మునిగే ప్రమాదం ఉందని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**కాసుల కక్కుర్తితో అనుమతుల జారీ**

కాసుల కక్కుర్తికి ఎంతటి అక్రమాలకైనా హెచ్ఎండీఏ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అనుమతులు జారీ చేసి అవినీతి, అక్రమాలకు తెగబడుతున్నారని బహిరంగ ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అన్నోజిగూడ వెంకటసాయి నగర్‌లో శాన్వీ ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట ఏర్పాటు చేసిన ఫైల్ నంబర్ 001556/హెచ్ఎండీఏ/00428/ఎస్ డబ్ల్యూ డి ఎల్ /జి టి కె /2025, లేఅవుట్ ఎల్‌పీ నంబర్ 0174/హెచ్ఎండీఏ/ఎస్ డబ్ల్యూ డి ఎల్ /2025కు అనుమతులు జారీ చేశారు. వాస్తవంగా హెచ్ఎండీఏ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు జాయింట్ సర్వే చేసి లేఅవుట్ అనుమతులు జారీ చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే లేఅవుట్ అనుమతులు ఇచ్చేముందు ప్రభుత్వ భూములు, చెరువులు, నాలాలు, కుంటలు ఏమైనా ఉన్నాయా లేదా అనే విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి, తదుపరి ఎన్‌ఓసీలు జారీ చేయాల్సి ఉంటుంది. కానీ లేఅవుట్ నడి మధ్యలో నుంచి నాలా ప్రవహిస్తుంటే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు జాయింట్ సర్వే చేసి ఎన్‌ఓసీని నిరాకరించాలి. అలా కాకుండా గతంలో పని చేసిన అధికారులు జారీ చేసినట్లు తెలుస్తున్నప్పటికీ, ప్రస్తుతం ఇరిగేషన్ ఏఈఈ, డీఈఈలు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. హెచ్ఎండీఏ విభాగం నుంచి ఏపీఓ, పీఓ, సీపీఓ, రెవెన్యూ తహసీల్దార్ స్థాయి అధికారులు లేఅవుట్‌ను క్షేత్రస్థాయిలో భౌతికంగా పరిశీలించకుండానే అనుమతులు జారీ చేయడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.





చిన్న తూము ద్వార వెంచర్ మధ్య నుంచి ప్రవహిస్తున్న నాల

**హైడ్రా అధికారులు స్పందిస్తేనే.**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన హైడ్రా ద్వారా చెరువులు, కుంటలు, నాలాల పరిరక్షణకు చర్యలు చేపడుతున్నప్పటికీ, కేవలం చెరువులను శుభ్రపరచడం వల్ల మాత్రమే ఆశించిన ఫలితాలు రావని స్థానికులు పేర్కొంటున్నారు. చెరువులకు జీవనాడులుగా ఉన్న ఫీడర్ నాలాలు, తూములు మూసివేతకు గురవుతుంటే చెరువుల్లోకి నీరు ఎలా వస్తుంది, అదనపు నీరు ఎలా బయటకు వెళ్తుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకవైపు కోట్ల రూపాయలు వెచ్చించి చెరువుల పునరుద్ధరణ పనులు చేపడుతుండగా, మరోవైపు చెరువులకు అనుసంధానంగా ఉన్న సహజ నీటి ప్రవాహ మార్గాలు ఆక్రమణలకు గురవుతున్నా సంబంధిత శాఖలు పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అన్నోజిగూడ వెంకటసాయి నగర్ ప్రాంతంలో నాలాలు, తూములు మూసివేతపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ, కొందరు హైడ్రా అధికారులు కేవలం నామమాత్రపు పరిశీలనకే పరిమితమవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి సర్వే నిర్వహించి వాస్తవ పరిస్థితులను నమోదు చేయకుండా, పరిశీలన పేరుతో వచ్చి వెళ్లిపోతున్నారని వారు వాపోతున్నారు. ఫిర్యాదులపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన చోట కేవలం నివేదికలకే పరిమితమవడం వల్ల అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదని అంటున్నారు. సహజ నీటి ప్రవాహ మార్గాలను మూసివేసి నిర్మాణాలు చేపట్టడం వల్ల భవిష్యత్తులో భారీ వర్షాల సమయంలో వరద ముప్పు పెరిగే అవకాశం ఉందని నిపుణులు సైతం హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం మూసివేసిన నాలాలు, తూముల కారణంగా వర్షపు నీరు వెళ్లే మార్గాలు కుంచించుకుపోయి సమీప కాలనీలు, నివాస ప్రాంతాలు నీట మునిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువులను కాపాడాలంటే కేవలం చెరువు హద్దులను మాత్రమే కాకుండా వాటికి నీటిని అందించే ఫీడర్ ఛానళ్లు, నాలాలు, తూములను కూడా పరిరక్షించాల్సిన అవసరం ఉందని వారు సూచిస్తున్నారు. ఇప్పటికైనా హైడ్రా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి రెవెన్యూ, ఇరిగేషన్, హెచ్ఎండీఏ శాఖలతో కలిసి సంయుక్త సర్వే నిర్వహించాలని, నాలాలు, తూముల అసలు స్వరూపాన్ని గుర్తించి ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు ఉన్నట్లయితే వెంటనే తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ప్రభుత్వ లక్ష్యాలకు విరుద్ధంగా చెరువులు, సహజ నీటి వనరుల మనుగడే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.








## మళ్ళీ మోదీనే

**ఢిల్లీ, మహా :** దేశంలో ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి పూర్తి మెజారిటీతో మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని 'ఇండియా టుడే సీఓటర్' నిర్వహించిన తాజా 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వే వెల్లడించింది. ఇప్పుడు ఎన్నికలు జరిగితే ఎన్డీఏ కూటమి 326 సీట్లు గెలుచుకుని సునాయాసంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని సర్వే అంచనా వేసింది. అయితే ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన ఎంఓటీఎన్ సర్వేతో పోలిస్తే ఎన్డీఏ బలం కొంత బలం తగ్గిందని స్పష్టం చేసింది. జనవరి సర్వేలో 352 సీట్లు వస్తాయని అంచనా వేయగా, ప్రస్తుతం 26 సీట్లు తగ్గి 326 సీట్లకు పడిపోయింది. అయితే ఎన్డీయే కూటమి బలం తగ్గుదల వెనుక నీట్ ఎగ్జామ్, రామ మందిర విరాళాల చోరీ, ఈ20 పెట్రోల్ వంటి అంశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## రేవంత్ రెడ్డి పాలిటిక్స్ లో..

**హైదరాబాద్, మహా :** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ రాజకీయ భవిష్యత్తుపై ఆయన మామ, కాంగ్రెస్ సీనియర్ నేత కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో తమిళనాడు రాజకీయాల్లో సినీ నటుల ఎంట్రీ గురించి చర్చ జరుగుతున్న సమయంలో.. "విజయ్ దళపతి తరహాలో తెలంగాణలో అల్లు అర్జున్‌ను కూడా భవిష్యత్ సీఎంగా ప్రజలు భావిస్తే?" అనే ప్రశ్న చంద్రశేఖర్ రెడ్డికి ఎదురైంది. దీనిపై ఆయన స్పందిస్తూ.. "ప్రజలు అలా అనుకుంటే అందులో తప్పేముంది? అల్లు అర్జున్‌కు ఖచ్చితంగా ఆ స్థాయి ఉంది" అంటూ వ్యాఖ్యానించారు. సరైన వ్యక్తి రాజకీయాల్లోకి వస్తే ప్రజల్లో మార్పు తీసుకురాగలడని కూడా ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే ఇంటర్వ్యూలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, అల్లు అర్జున్‌లలో ఎవరు ఎక్కువ స్పీడ్ అనే ప్రశ్నకు కూడా చంద్రశేఖర్ రెడ్డి ఆసక్తికర సమాధానం ఇచ్చారు. రేవంత్ రెడ్డి రాజకీయాల్లో స్పీడ్ అయితే.. అల్లు అర్జున్ సినిమాల్లో స్పీడ్ అని పేర్కొంటూ, ఇద్దరూ "బుల్లెట్ ట్రైన్లే" అంటూ ప్రశంసించారు. అల్లు అర్జున్ గతంలో తన మామ కోరిక మేరకు కొన్ని ప్రాంతాల్లో సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు.

# తెలంగాణలో 'సెన్సస్–2027'కు రంగం సిద్ధం

( మొదటి పేజీ తరువాయి )

నివాస, వలస, గుర్తింపు తదితర అంశాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించనున్నారు. మొత్తం 40 రకాల వివరాలను నమోదు చేసే విధంగా జనగణన ప్రక్రియను రూపొందించినట్లు సమాచారం. దీంతో ఈసారి జనగణన కేవలం జనాభా లెక్కింపునకు పరిమితం కాకుండా దేశ జనాభా సామాజిక, ఆర్థిక పరిస్థితిపై విస్తృత సమాచారాన్ని అందించే ప్రక్రియగా మారనుంది.

జనగణనలో మొదటగా ప్రతి వ్యక్తికి సంబంధించిన ప్రాథమిక వివరాలను నమోదు చేయనున్నారు. ఇందులో వ్యక్తి పేరు, వయస్సు, లింగం, వైవాహిక స్థితి వంటి అంశాలు ఉంటాయి. కుటుంబంలో ఎంతమంది సభ్యులు ఉన్నారు, వారి వయస్సు, లింగం, కుటుంబ స్థితి వంటి వివరాల ఆధారంగా జనాభా నిర్మాణంపై సమగ్ర సమాచారం అందుబాటులోకి రానుంది. ఈసారి జనగణనలో కులానికి సంబంధించిన వివరాల సేకరణకు కూడా ప్రాధాన్యం ఇవ్వడం ప్రత్యేకంగా నిలుస్తోంది. వ్యక్తి ఏ కులానికి చెందినవారు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందినవారా అనే వివరాలను నమోదు చేయనున్నారు. సామాజిక వర్గాల వారీగా జనాభా నిర్మాణాన్ని అర్థం చేసుకునేందుకు ఈ సమాచారం కీలకంగా మారనుంది. వివిధ సంక్షేమ పథకాలు, సామాజిక విధానాల రూపకల్పనలో జనాభా గణాంకాలు ఉపయోగపడే అవకాశం ఉంది. అదే విధంగా వ్యక్తుల మతానికి సంబంధించిన వివరాలను కూడా నమోదు చేయనున్నారు. దేశంలో వివిధ మతాలకు చెందిన జనాభా పంపిణీపై తాజా గణాంకాలు అందుబాటులోకి రావడానికి ఇది దోహద పడుతుంది. కులం, మతం, ఎస్సీ, ఎస్టీ వంటి సామాజిక వివరాలను సేకరించడం వల్ల దేశ జనాభా సామాజిక నిర్మాణంపై మరింత స్పష్టమైన గణాంకాలు లభించే అవకాశం ఉంది.




విద్యార్హతలకు సంబంధించిన సమాచారాన్ని కూడా జనగణనలో నమోదు చేయనున్నారు. ఒక వ్యక్తి ఎంతవరకు చదువుకున్నారు, వారి విద్యా స్థాయి ఏమిటి అనే వివరాలను సేకరించనున్నారు. దేశంలో అక్షరాస్యత, విద్యా స్థాయి, ఉన్నత విద్యలో పాల్గొనడం వంటి అంశాలపై భవిష్యత్ విధానాల రూపకల్పనకు ఈ సమాచారం ఉపయోగపడనుంది. వ్యక్తుల ఉద్యోగం, వృత్తి, పనిచేస్తున్న రంగం వంటి వివరాలను కూడా సేకరించనున్నారు. ఒక వ్యక్తి ఏ రంగంలో పనిచేస్తున్నారు, వారి ప్రధాన వృత్తి ఏమిటి, ఉద్యోగ స్వభావం ఏంటి వంటి అంశాలపై సమాచారం నమోదు చేయనున్నారు. వ్యవసాయం, పారిశ్రామిక రంగం, సేవా రంగం, స్వయం ఉపాధి తదితర రంగాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని అంచనా వేయడానికి ఈ వివరాలు ఉపయోగపడనున్నాయి.

దేశంలో ప్రజల వలసలపై కూడా ఈసారి జనగణనలో ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు. ఒక వ్యక్తి ఎక్కడ జన్మించారు, ప్రస్తుతం ఎక్కడ నివసిస్తున్నారు, గతంలో ఎక్కడ నివసించారు వంటి వివరాలను నమోదు చేయనున్నారు. ముఖ్యంగా ఉద్యోగం, విద్య, ఉపాధి, వివాహం వంటి కారణాలతో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలస వెళ్లిన వారి వివరాలను విశ్లేషించేందుకు ఈ సమాచారం ఉపయోగపడనుంది. తెలంగాణ వంటి వేగంగా పట్టణీకరణ చెందుతున్న రాష్ట్రానికి వలసల సమాచారం మరింత కీలకంగా మారనుంది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి తదితర పట్టణ ప్రాంతాల్లో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చి స్థిరపడుతున్నారు. అదే సమయంలో తెలంగాణ జిల్లాల నుంచి ఇతర రాష్ట్రాలు, పట్టణాలకు ఉపాధి కోసం వెళ్లే వారి సంఖ్య కూడా ఉంది. జనగణన ద్వారా వలసల స్వరూపం, దిశ, కారణాలపై విస్తృత సమాచారం అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. గుర్తింపు పత్రాలకు సంబంధించిన వివరాల సేకరణకు కూడా గెజిట్‌లో అవకాశం కల్పించినట్లు సమాచారం. వ్యక్తి వద్ద ఆధార్, ఓటర్ ఐడీ, పాస్‌పోర్ట్ వంటి గుర్తింపు పత్రాలు ఉన్నాయా, వాటికి సంబంధించిన వివరాలను నమోదు చేసే అవకాశం ఉంటుంది. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ ఉందా లేదా అనే అంశాన్ని కూడా నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. బ్యాంక్ ఖాతాలు, మొబైల్ నంబర్ వంటి వివరాల సేకరణకు కూడా అవకాశం కల్పించినట్లు సమాచారం. అయితే ఇలాంటి వ్యక్తిగత సమాచారాన్ని ఏ విధంగా, ఏ అవసరానికి సేకరిస్తారు, దాని గోప్యతను ఎలా కాపాడుతారు వంటి అంశాలు జనగణన ప్రక్రియలో అత్యంత కీలకంగా మారనున్నాయి. ప్రజల వ్యక్తిగత సమాచార భద్రతకు సంబంధించిన నిబంధనలను స్పష్టంగా పాటించాల్సిన అవసరం ఉంటుంది.

గెజిట్ నోటిఫికేషన్ మరోసారి ప్రచురించడంతో తెలంగాణలో జనగణన ప్రక్రియకు సంబంధించి అధికారిక పరిపాలనా చర్యలు మరింత వేగం పుంజుకోనున్నాయి. ఆగస్టు 29న తెలంగాణ గెజిట్‌లో నోటిఫికేషన్ ప్రచురించిన తర్వాత సంబంధిత శాఖలు జనగణనకు సంబంధించిన తదుపరి ఏర్పాట్లను చేపట్టనున్నాయి. రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా, మండల, క్షేత్రస్థాయి వరకు అధికారులు, సిబ్బందికి బాధ్యతలు కేటాయించే ప్రక్రియ ముందుకు సాగే అవకాశం ఉంది. జనాభా లెక్కల ఆధారంగా ప్రభుత్వ పథకాలు, మౌలిక వసతుల ప్రణాళిక, విద్యా సంస్థల అవసరాలు, వైద్య సదుపాయాలు, ఉపాధి విధానాలు, పట్టణాభివృద్ధి, రవాణా, గృహ నిర్మాణం వంటి అనేక అంశాలకు భవిష్యత్ ప్రణాళికలు రూపొందుతాయి. అందువల్ల సెన్సస్-2027లో సేకరించే సమాచారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు దీర్ఘకాలిక విధానాల రూపకల్పనలో కీలకంగా మారనుంది. ప్రత్యేకంగా తెలంగాణలో పట్టణ జనాభా వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో జనగణన గణాంకాలకు ప్రాధాన్యం మరింత పెరగనుంది. హైదరాబాద్ పరిధిలో జనాభా విస్తరణ, కొత్తగా ఏర్పడుతున్న నివాస ప్రాంతాలు, వలస కార్మికుల సంఖ్య, ఉపాధి రంగాల్లో మార్పులు, విద్యా స్థాయి తదితర అంశాలపై తాజా సమాచారం ప్రభుత్వానికి అందుబాటులోకి రావచ్చు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో జనాభా మార్పులు, యువత వలసలు, వ్యవసాయంపై ఆధారపడుతున్న కుటుంబాల పరిస్థితి, విద్యా స్థాయి, ఉపాధి స్వరూపం వంటి అంశాలపై కూడా జనగణన గణాంకాలు స్పష్టతనివ్వనున్నాయి. జిల్లాల వారీగా జనాభా నిర్మాణాన్ని అంచనా వేసి భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ఈ సమాచారం ఉపయోగపడుతుంది.

సెన్సస్-2027లో కులం, మతం, విద్య, వృత్తి, వలసలు వంటి సామాజిక వివరాలతో పాటు గుర్తింపు, సంప్రదింపు వివరాలను కూడా నమోదు చేసే అవకాశం ఉండటంతో ఈ జనగణనపై ప్రజల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా వ్యక్తిగత సమాచార సేకరణ నేపథ్యంలో గోప్యత, డేటా భద్రత, సమాచార వినియోగం వంటి అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పించడం అధికారుల ముందున్న మరో కీలక బాధ్యతగా మారనుంది.

# మీరాలం చెరువులో వాటర్ స్పోర్ట్స్, ఐ ల్యాండ్

( మొదటి పేజీ తరువాయి )

చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. చెరువు నుంచి మూసీ నదిలోకివరద నీరు సాఫీగా వెళ్లేలా నాలాను విస్తరించాలని ఆదేశించారు. వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసినప్పుడు చెరువులో నీటి నిల్వ, వరద ప్రవాహం కారణంగా ఇబ్బందులు తలెత్తకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాల్సిన అవసరాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చెరువును కేవలం నీటి వనరుగా కాకుండా నగర ప్రజలకు ఆహ్లాదకరమైన పర్యాటక, వినోద ప్రాంతంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో సీఎం పలు సూచనలు చేశారు. వాటర్ స్పోర్ట్స్‌కు అనువుగా ప్రత్యేక డిజైన్‌ను రూపొందించాలని, మీరాలం చెరువులోని ఐలాండ్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు.సందర్శకులను ఆకర్షించేలా పరిసర ప్రాంతాలను తీర్చిదిద్దడంతోపాటు ప్రజలకు మెరుగైన పబ్లిక్ స్పేస్‌లు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. మీరాలం చెరువుపై నిర్మిస్తున్న సస్పెన్షన్ బ్రిడ్జి పూర్తయితే ఈ ప్రాంతానికి ప్రత్యేక ఆకర్షణ ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు



చెబుతున్నారు. వంతెనతోపాటు చెరువు పరిసరాల అభివృద్ధి పూర్తయితే నగరంలోని మరో కీలక వినోద, పర్యాటక కేంద్రంగా మీరాలం రూపుదిద్దుకునే అవకాశముందని అంటున్నారు. సీఎం ఆకస్మిక తనిఖీతో అధికారులు అప్రమత్తమయ్యారు. నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, గడువులు, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలపై మరింత దృష్టి సారించారు. కాగా, చెరువు అభివృద్ధితోపాటు వరద నీటి నిర్వహణ, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది.

# ఫలించిన సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నం

( మొదటి పేజీ తరువాయి )

కేంద్ర జల సంఘం చైర్మన్ అధ్యక్షతన సేవా భవన్‌లో జరిగే ఈ సమావేశంలో తెలంగాణ, మహారాష్ట్ర జల వనరుల శాఖల ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి మే 26న మహారాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాసి, రెండు రాష్ట్రాల మధ్య సమావేశం ఏర్పాటు చేసి పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం సూచించాలని కోరారు. ఈ అంశాన్ని ప్రధానమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్లగా, ప్రధానమంత్రి కార్యాలయం జలశక్తి మంత్రిత్వ శాఖకు పంపించింది. అనంతరం ముఖ్యమంత్రి గారు ఆగస్టు 5న కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌కి ప్రత్యేకంగా లేఖ రాసి కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరారు. మహారాష్ట్ర గతంలో అంగీకరించిన 148 మీటర్ల ఎత్తుకు బదులుగా 152 మీటర్ల ఎత్తు ఉండేలా అంగీకారం సాధించేందుకు తెలంగాణ ప్రయత్నిస్తోంది. 148 మీటర్ల వద్ద అవసరమైన నీటిని గ్రావిటీ ద్వారా తీసుకోవడం సాధ్యం కాదని, భారీ పంపులు వినియోగిస్తే విద్యుత్ వ్యయం పెరుగుతుందని తెలంగాణ ఇప్పటికే కేంద్రానికి నివేదించింది. తక్కువ విద్యుత్ వ్యయంతో, దీర్ఘకాలికంగా రాష్ట్రానికి ప్రయోజనం కలిగేలా ప్రాజెక్టును నిర్మించాలన్నది తెలంగాణ ప్రభుత్వ ప్రధాన వాదన. సీడబ్ల్యూపీఆర్ఎస్ అధ్యయనాల ప్రకారం జలమట్టం పెంచడం వల్ల అదనపు ముంపు పరిమితంగానే ఉంటుందని కూడా ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి వివరించింది. వెనుకబడిన, కరవు ప్రభావిత ప్రాంతాలకు సాగునీరు అందించే ఈ కీలక ప్రాజెక్టును త్వరగా కార్యరూపంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కేంద్రం, మహారాష్ట్రతో వరుసగా సంప్రదింపులు కొనసాగిస్తోంది.

# డీలిమిటేషన్‌పై ఏకపక్ష నిర్ణయాలు వద్దు

**ఢిల్లీ, మహా :** దేశ రాజకీయ భవిష్యత్తుపై సుదూర ప్రభావం చూపే నియోజకవర్గాల పునర్విభజన(డీలిమిటేషన్) వంటి అత్యంత సున్నితమైన అంశంపై కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా ముందుకు వెళ్లొద్దని ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. డీలిమిటేషన్ ప్రతిపాదనలపై పార్లమెంటులో బలవంతంగా బిల్లు ప్రవేశపెట్టే ప్రయత్నం చేయకుండా, ముందుగా అన్ని రాజకీయ పార్టీలతో సమగ్రంగా చర్చించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధానమంత్రికి లేఖ రాసిన ఖర్గే.. దేశ భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాలను పారదర్శకంగా, ఏకాభిప్రాయంతో తీసుకోవాలని స్పష్టం చేశారు. డీలిమిటేషన్‌పై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పార్లమెంట్ సమావేశాలు నిర్వహించబోతున్నట్లు జరుగుతున్న చర్చల నేపథ్యంలో ఖర్గే లేఖ ప్రాధాన్యం సంతరించుకుంది. నియోజకవర్గాల పునర్విభజన కేవలం ఎన్నికల నియోజకవర్గాల సంఖ్యను మార్చే ప్రక్రియ కాదని, ఇది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం, సమాఖ్య వ్యవస్థ, ప్రజాస్వామ్య సమతుల్యత, దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలతో ముడిపడి ఉన్న అంశమని కాంగ్రెస్ అభిప్రాయపడుతోంది. అందువల్ల కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకునే ముందు అన్ని పార్టీలను విశ్వాసంలోకి తీసుకోవాలని ఖర్గే కోరారు.



**మూడు డిమాండ్లు**

డీలిమిటేషన్ అంశంపై కాంగ్రెస్ తరపున మూడు ప్రధాన డిమాండ్లను ఖర్గే ప్రధాని ముందుంచారు. ప్రస్తుతం దేశంలో ఉన్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్యను ఎట్టి పరిస్థితుల్లోనూ తగ్గించకూడదని, పెంచకూడదని, ఇదే సంఖ్యను మరో 25 సంవత్సరాల పాటు కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రాల వారీగా ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాల ప్రాతినిధ్యంలోనూ ఎలాంటి మార్పులు చేయకుండా కొనసాగించాలని ్పష్టం చేశారు.

జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాలకు రాజకీయ ప్రాతినిధ్య పరంగా నష్టం కలిగే అవకాశం ఉందన్న ఆందోళన దక్షిణాది రాష్ట్రాల్లో ఇప్పటికే వ్యక్తమవుతోంది. ముఖ్యంగా కుటుంబ నియంత్రణ, జనాభా నియంత్రణ విధానాలను సమర్థంగా అమలు చేసిన రాష్ట్రాలకు శిక్ష పడేలా కొత్త ప్రాతినిధ్య విధానం ఉండకూడదని కాంగ్రెస్ వాదిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత రాష్ట్రాల వారీ ప్రాతినిధ్యాన్ని మరో 25 ఏళ్లపాటు కొనసాగించాలన్న డిమాండ్‌ను ఖర్గే ముందుకు తెచ్చారు.

మహిళా రిజర్వేషన్ అంశాన్ని కూడా ఖర్గే తన లేఖలో కీలకంగా ప్రస్తావించారు. చట్టసభల్లో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్లను 2029 లోక్‌సభ ఎన్నికల నుంచే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ అమలును మరింత ఆలస్యం చేయకుండా, రాబోయే లోక్‌సభ ఎన్నికల నాటికే మహిళలకు 33 శాతం ప్రాతినిధ్యం కల్పించేలా చర్యలు చేపట్టాలని కోరారు. డీలిమిటేషన్ ప్రక్రియతో మహిళా రిజర్వేషన్‌ను ముడిపెట్టి అమలును వాయిదా వేయడం సరికాదని కాంగ్రెస్ స్పష్టం చేస్తోంది.

డీలిమిటేషన్ వంటి రాజ్యాంగపరంగా, రాజకీయంగా అత్యంత కీలకమైన అంశంపై ప్రభుత్వం 'బుల్డోజర్' తరహా నిర్ణయాలు తీసుకోకూడదని ఖర్గే హెచ్చరించారు. గతంలో ఏప్రిల్ 16, 17 తేదీల్లో జరిగిన పరిణామాలను ప్రస్తావిస్తూ.. అదే తరహాలో ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవద్దని ప్రధానికి సూచించారు. ప్రతిపక్షాల అభిప్రాయాలను పట్టించుకోకుండా సంఖ్యాబలంతో నిర్ణయాలను ఆమోదించుకోవడం వంటి విధానాలను పునరావృతం చేయొద్దని కోరారు.

డీలిమిటేషన్‌పై తాను గతంలో జూలై 16, 2026న రాసిన లేఖను కూడా ఖర్గే ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. అప్పట్లోనే ఈ అంశంపై అన్ని రాజకీయ పార్టీలతో విస్తృతంగా చర్చించాల్సిన అవసరాన్ని తాను వివరించానని గుర్తుచేశారు. అయితే ఇప్పటికీ స్పష్టమైన, పారదర్శకమైన అఖిలపక్ష చర్చ జరగకపోవడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. దేశంలోని ప్రతి ప్రాంతం, ప్రతి రాష్ట్రం, ప్రతి రాజకీయ పార్టీకి సంబంధించిన అంశంగా దీనిని పరిగణించాలని కోరారు.

డీలిమిటేషన్ ప్రక్రియలో పారదర్శకత అత్యంత కీలకమని ఖర్గే పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన ప్రతిపాదనలు, ప్రమాణాలు, రాష్ట్రాల వారీగా వచ్చే ప్రభావం, ప్రాతినిధ్యంలో మార్పులు వంటి అంశాలను బహిరంగంగా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన కీలక నిర్ణయాలు రాజకీయ ఏకాభిప్రాయంతోనే ముందుకు సాగాలని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రస్తుత 543 లోక్‌సభ స్థానాల సంఖ్యను మరో 25 ఏళ్ల పాటు కొనసాగించాలన్న కాంగ్రెస్ డిమాండ్ వెనుక దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యంపై ఉన్న ఆందోళన ప్రధానంగా కనిపిస్తోంది. జనాభా ఆధారంగా స్థానాల పునర్విభజన జరిగితే జనాభా అధికంగా ఉన్న రాష్ట్రాలకు లోక్‌సభలో ఎక్కువ స్థానాలు, జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాలకు తక్కువ స్థానాలు వచ్చే అవకాశం ఉందన్న చర్చ చాలా కాలంగా కొనసాగుతోంది. ఇది దేశ సమాఖ్య వ్యవస్థలో రాజకీయ సమతుల్యతపై ప్రభావం చూపవచ్చని దక్షిణాది రాజకీయ పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

ఈ నేపథ్యంలో డీలిమిటేషన్‌ను కేవలం రాజ్యాంగపరమైన ప్రక్రియగా కాకుండా దేశంలోని అన్ని ప్రాంతాల రాజకీయ ప్రాతినిధ్యంతో ముడిపడిన అంశంగా చూడాలని ఖర్గే కోరారు. ఒక రాష్ట్రం జనాభా నియంత్రణలో మెరుగైన పనితీరు కనబరిచినందుకు భవిష్యత్తులో పార్లమెంటరీ ప్రాతినిధ్యం తగ్గే పరిస్థితి రాకూడదని కాంగ్రెస్ వాదిస్తోంది. దేశ సమగ్రాభివృద్ధి, సమాఖ్య స్ఫూర్తి, రాష్ట్రాల మధ్య సమతుల్యతను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలని కోరుతోంది.

మరోవైపు మహిళా రిజర్వేషన్ విషయంలోనూ కేంద్రం స్పష్టమైన కాలపరిమితిని ప్రకటించాలని ఖర్గే డిమాండ్ చేశారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే నిర్ణయాన్ని 2029 ఎన్నికల నుంచే అమల్లోకి తీసుకురావాలని అన్నారు. దేశ రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచే విషయంలో ఇక ఆలస్యం చేయకూడదని స్పష్టం చేశారు.

డీలిమిటేషన్ అంశంపై అఖిలపక్ష సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని ఖర్గే ప్రధాన డిమాండ్‌గా ముందుంచారు. కేంద్రం ప్రతిపాదించే మార్పులపై ప్రతి రాజకీయ పార్టీకి తన అభిప్రాయాన్ని వెల్లడించే అవకాశం ఇవ్వాలని కోరారు. సమావేశంలో వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు.

దేశ భవిష్యత్ రాజకీయ నిర్మాణాన్ని ప్రభావితం చేసే డీలిమిటేషన్ ప్రక్రియపై ప్రభుత్వం తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటే రాజకీయంగా తీవ్ర ప్రతిఘటన ఎదురయ్యే అవకాశం ఉందన్న సంకేతాన్ని ఖర్గే లేఖ ఇచ్చింది. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలు, ప్రస్తుత పార్లమెంటరీ ప్రాతినిధ్యం, మహిళా రిజర్వేషన్, కేంద్ర-రాష్ట్ర సంబంధాలు వంటి అంశాలు ఈ చర్చలో కీలకంగా మారనున్నాయి.

# పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుపై రాజకీయం

**ీవో 97ను వెంటనే రద్దు చేయాలి: హరీష్ రావు**

**హనుమకొండ, మహా :** పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. గురువారం వరంగల్ పర్యటనకు వచ్చిన ఆయన పాలిటెక్నిక్ విద్యార్థులను కలిసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పోలీసుల మధ్య తోపులాట జరగడంతో హనుమకొండలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.వరంగల్, హనుమకొండ జిల్లాల ఉపాధ్యాయ, ఉద్యోగ, గెజిటెడ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాకు హరీష్‌రావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, ఉద్యోగులు, రైతుల సమస్యలను అసెంబ్లీలో ప్రశ్నించడం ప్రతిపక్షాల హక్కని అన్నారు. ప్రశ్నించే గొంతులను అణచివేస్తూ ప్రభుత్వం అక్రమ అరెస్టులు, కేసులకు పాల్పడుతోందని ఆరోపించారు.ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయాలన్న నిర్ణయం విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తుందని హరీష్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. జీవో 97ను వెంటనే రద్దు చేసి పాలిటెక్నిక్ కళాశాలలను ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. స్కిల్ యూనివర్సిటీ పబ్లిక్‌ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో ఉన్నందున భవిష్యత్తులో ఫీజుల భారం పెరిగే ప్రమాదం ఉందన్నారు. పాలిటెక్నిక్, ఐటీఐ విద్యకు తేడా ఉందని, ప్రభుత్వం అవగాహన లేకుండా నిర్ణయాలు తీసుకోవడం వల్ల విద్యార్థుల విద్యా అవకాశాలు దెబ్బతింటాయని పేర్కొన్నారు.వరంగల్ పాలిటెక్నిక్ కళాశాలలో కొంతమంది విద్యార్థులు టీసీలు తీసుకుని వెళ్లినట్లు




హరీష్ రావు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొన్నా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. ఆంధ్రప్రదేశ్, ఢిల్లీలో ఇలాంటి విధానాలపై పునరాలోచన జరిగిన విషయాన్ని ప్రస్తావిస్తూ తెలంగాణ ప్రభుత్వం కూడా తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు.ఉద్యోగుల సమస్యలపైనా ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. డీఏలు, పీఆర్సీ పెండింగ్‌లో ఉన్నాయని, హెల్త్ ఇన్సూరెన్స్, ఓపీఎస్ వంటి హామీలను ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపించారు. ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, రైతులు సమస్యలపై రోడ్లపైకి వచ్చే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. అక్రమ అరెస్టులకు భయపడేది లేదని, ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని హరీష్ రావు స్పష్టం చేశారు. జీవో 97ను రద్దు చేసే వరకు విద్యార్థుల తరపున బీఆర్ఎస్ పోరాడుతుందని తెలిపారు.

# అన్నాచెల్లెళ్ల, అక్కా తమ్ముళ్ళ అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ

**మంత్రి కొండా సురేఖ**

**వరంగల్, బ్యూరో మహా ;** రాఖీ పండుగ కేవలం అన్నాచెల్లెళ్ల, అక్కాతమ్ముళ్ళ అనుబంధానికి ప్రతీక మాత్రమే కాదని ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవం, బాధ్యతలకు నిదర్శనంగా భారతీయ సంస్కృతిలో ఈ పండుగకు చారిత్రక ప్రాధన్యత వున్నదని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ అన్నారు. నేడు రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని మంత్రి కొండా సురేఖ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ తాత్విక దృక్పథంలో అనుబంధం అనేది కేవలం రక్త సంబంధంతో మాత్రమే ఏర్పడేది కాదని, ఇరువురు వ్యక్తుల మధ్య పరస్పర విశ్వాసం, బాధ్యతలతో ఈ బంధం బలపడుతుందని మంత్రి పేర్కొన్నారు. రక్తసంబంధం లేకపోయినా ఎంతోమంది సోదర సోదరీమణులు ఈ పండుగను తమ ఆప్యాయత, అనురాగాలకు ప్రతీకగా జరుపుకుంటారని మంత్రి అన్నారు. రాఖీ కట్టడం ద్వారా సోదరి తన ప్రేమను, నమ్మకాన్ని వ్యక్తం చేస్తే, సోదరుడు ఆమెకు అండగా నిలవాలనే బాధ్యతను స్వీకరించే సంప్రదాయం ఈ పండుగలో అంతర్లీనంగా వుందని మంత్రి తెలిపారు. పరస్పరం ఒకరికొకరు అండగా నిలవడం, కష్టసుఖాల్లో తోడుగా ఉండటం అనే మానవీయ సందేశాన్ని 'రక్షాబంధన్' అందిస్తుందని మంత్రి సురేఖ వివరించారు. ప్రస్తుత సమాజంలో రాఖీ పండుగ అందించే సందేశాన్ని అందరూ అర్థం చేసుకోవాల్సి అవసరం వున్నదని మంత్రి తెలిపారు. మహిళల గౌరవం, సమానత్వం, స్వాభిమానాన్ని కాపాడుతూ వారికి



అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించడమే వారికందించే నిజమైన రక్షణ అని మంత్రి సురేఖ అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎంతో బాధ్యతతో ఈ పనిలో నిమగ్నమై వున్నదని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి సోదరుడు తన సోదరి గౌరవం, భద్రత, అభివృద్ధికి అండగా నిలవడంతో పాటు, ప్రతి కుటుంబం ఆడపిల్లల విద్య, స్వావలంబన, సాధికారతకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు.రక్షాబంధన్' స్ఫూర్తి కుటుంబాలకే పరిమితం కాకుండా సమాజం మొత్తం విస్తరించాలి. పరస్పర గౌరవం, సహకారం, మానవత్వం పెంపొంది, సమాజం మరింత సురక్షితంగా, సమానత్వంతో ముందుకు సాగాలని మంత్రి కొండా సురేఖ ఆకాంక్షించారు.

# పెద్దపల్లిలో టీజీజాక్ మహా ధర్నా

**సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం ఉధృతం: టీజీజాక్**

**పెద్దపల్లి, మహా:** తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం టీజీజాక్ ఆధ్వర్యంలో గురువారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ గేట్ వద్ద మహా ధర్నా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు భారీగా తరలివచ్చారు. జానపద కళాకారుల ఉద్యమ గీతాలు, నృత్య ప్రదర్శనలతో ధర్నా ప్రాంగణం హోరెత్తింది.ఈ సందర్భంగా టీజీజాక్ చైర్మన్ బొంకూరి శంకర్ మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ అమలు, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏల విడుదల, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరణ, పెండింగ్ బిల్లుల చెల్లింపు, హెల్త్ కార్డుల సమర్థవంతమైన అమలు వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టడంతో పాటు జీవో 25 సవరణ, జీవో 190 అమలు చేయాలని అన్నారు.కన్వీనర్ తూము రవీందర్ పటేల్ మాట్లాడుతూ ఉద్యోగుల ఐక్యతే ఉద్యమానికి ప్రధాన బలమని పేర్కొన్నారు. ప్రభుత్వం సమస్యలను పరిష్క



రించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సెప్టెంబర్ 1న నిర్వహించే పెన్షన్ విద్రోహ దినంతో పాటు తదుపరి రాష్ట్రవ్యాప్త కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. టీఎన్జీఓ జిల్లా కార్యదర్శి అయిరెడ్డి సందీప్ రెడ్డి కార్యక్రమ విజయానికి కీలకంగా వ్యవహరించారు. వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు, నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉద్యోగుల హక్కులు సాధించే వరకు పోరాటం కొనసాగుతుందని నినదిస్తూ మహా ధర్నాను విజయవంతంగా ముగించారు.

# సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనుల పురోగతి పరిశీలన

- **నిర్దేశిత గడువులోగా ఆసుపత్రి పనులను పూర్తి చేయాలి**
- **వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్, మహా ;** వరంగల్ జిల్లాలో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద గురువారం పనులను పరిశీలించారు.పరిశీలన అనంతరం సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సమీక్ష లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రి భవన నిర్మాణం, మౌలిక వసతులు, విద్యుత్, తదితర పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఎలాంటి లోపాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రి పూర్తయితే జిల్లాతో పాటు ఇతర పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం సూపరిటెండెంట్ రాంకుమార్ రెడ్డి, ఆర్ ఎం.ఓ అశ్విన్, ఆర్.అండ్.బి. ఇ ఇ రాజేందర్,ఎలక్ట్రిసిటీ ఎస్ ఇ ఆనందం,వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్ సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.



ANN తెలుగు

మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్

28-08-2026

మహా ప్రత్యేకం



# రాఖీ అంటే రక్ష

## అన్నాచెల్లెళ్ల ప్రేమానుబంధానికి ప్రతీకగా రాఖీ పౌర్ణమి



శ్రావణ మాసపు శోభ వెల్లివిరుస్తున్న వేళ, ప్రకృతి పరవశించి పోతుంది. పచ్చని పైర్లు, చల్లటి గాలి, మబ్బుల చాటున దాగిన చంద్రుని వెలుగుల మధ్య పవిత్రమైన శ్రావణ పౌర్ణమి ఆగమనం సూచిస్తుంది. ఆకాశం హరివిల్లును అల్లుకున్నట్టుగా, భూలోకంలో అన్నాచెల్లెళ్ల అనురాగం రంగురంగుల రాఖీల రూపంలో ప్రతిబింబిస్తుంది. రాఖీ పౌర్ణమి, రక్షాబంధన్, అన్నా చెల్లెళ్ల పండుగ ఇలా పేర్లు వేరైనా పండుగ ఒకటే. సృష్టిలో తండ్రి తరువాత స్థానం అన్నదే! తల్లి తరువాత స్థానం చెల్లిదే. శాశ్వతమైన ఈ బంధాన్ని ప్రతి సంవత్సరం మరింత పటిష్టం చేయడమే రాఖీ పౌర్ణమి అంతరార్థం. ఆగస్టు 28, శుక్రవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పౌర్ణమి విశిష్టత గురించి ఈ కథనంలో తెలుసుకుందాం. తెలుగు పంచాంగం ప్రకారం శ్రావణ శుద్ధ పౌర్ణమిని రాఖీ పౌర్ణమిగా జరుపుకుంటాం. ఈ ఏడాది ఆగస్టు 28, శుక్రవారం రోజు శ్రావణ శుద్ధ పౌర్ణమి తిథి సూర్యోదయంతో ఉంది. అందుకే ఈ రోజునే రాఖీ పౌర్ణమిగా జరుపుకోవాలని పంచాంగ కర్తలు సూచిస్తున్నారు. ఈ రోజు రాఖీ కట్టడానికి శుభ ముహూర్తం ఉదయం 5:57 నిమిషాల నుండి ఉదయం 9:48 నిమిషాల వరకు ఉంది. ఈ సందర్భంగా రాఖీ పౌర్ణమి విశిష్టత గురించి తెలుసుకుందాం.

**పురాణాలలో..అక్షయ రక్షణ వస్త్రం**

తోబుట్టువుల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచే రాఖీ గురించిన ప్రస్తావన మన పురాణేతిహాసాల్లో కూడా ఉంది. వ్యాస మహర్షి రచించిన మహాభారతం ప్రకారం శిశుపాలుని శిక్షించే క్రమంలో శ్రీకృష్ణుడు తన సుదర్శన చక్రాన్ని ప్రయోగిస్తాడు. ఈ క్రమంలో శ్రీకృష్ణుని చూపుడు వేలుకు గాయమై రక్తం ధారగా కారుతుంది. అది చూసిన ద్రౌపది వెంటనే తాను ధరించిన పట్టు చీర కొంగును చింపి కృష్ణుని గాయానికి కట్టు కడుతుంది. ద్రౌపది అభిమానంతో చేసిన ఈ పనికి శ్రీకృష్ణుడు తాను ఎల్లవేళలా ద్రౌపదికి అండగా ఉంటానని మాట ఇస్తాడు. ఇచ్చిన మాట ప్రకారం ద్రౌపది ఇచ్చిన చిన్న చీర ముక్క ప్రతిఫలంగా నిండు సభలో ద్రౌపది వస్త్రాపహరణం జరుగుతున్న సమయంలో ఆమెకు అనేక చీరలు ఇచ్చి ఆమె అభిమానాన్ని కాపాడుతాడు. ఆనాటి నుంచి అన్నా చెల్లెళ్ల అనురాగానికి ప్రతీకగా చేతికి నూలు వస్త్రం కానీ దారం కానీ రక్షగా కట్టడం సంప్రదాయంగా మారింది. అదే రాఖీ అని పురాణాలు చెబుతున్నాయి.

**లక్ష్మీదేవి - బలి చక్రవర్తి: వైకుంఠాన్ని వీడిన నారాయణుడు**

మరో పౌరాణిక గాథ ప్రకారం, మహాభక్తుడైన బలి చక్రవర్తి యజ్ఞాన్ని సంరక్షించేందుకు స్వయంగా విష్ణుమూర్తి ఆయన ద్వారపాలకుడిగా మారాడు. భర్త వైకుంఠానికి రాకపోవడంతో లక్ష్మీదేవి పరితపించింది. అప్పుడు నారదుని సలహా మేరకు, ఆమె ఒక సాధారణ పేద మహిళ రూపంలో బలి చక్రవర్తి వద్దకు వెళ్లి ఆశ్రయం కోరింది. శ్రావణ పౌర్ణమి రోజున ఆ సాక్షాత్తు జగన్మాత బలి చక్రవర్తి మణికట్టుకు పవిత్రమైన రక్షా దారాన్ని కట్టి, తన భర్తను వైకుంఠానికి పంపేలా వరం కోరింది. ఆ దారంలోని పవిత్రతకు మురిసిపోయిన బలి చక్రవర్తి, తన సర్వస్వాన్ని దారపోసేందుకైనా సిద్ధపడి విష్ణుమూర్తిని సాగనంపాడు. ఆ పవిత్ర దారమే నాటి నుంచి సోదర ప్రేమకు నిదర్శనంగా నిలిచింది.

**రాణి కర్ణావతి - మొఘల్ చక్రవర్తి హుమాయున్**

చరిత్ర పుటలను తిరగేస్తే, మధ్యయుగంలో రాజ్‌పుత్ రాణి కర్ణావతి మరియు మొఘల్ చక్రవర్తి హుమాయున్ మధ్య జరిగిన అద్భుత ఘట్టం కనిపిస్తుంది. గుజరాత్ సుల్తాన్ బహదూర్ షా చేతిలో రాజ్యానికి ముప్పు వాటిల్లినప్పుడు, విపత్కర పరిస్థితుల్లో ఉన్న రాణి కర్ణావతి శత్రువుల మతాలను చూడలేదు; కేవలం మానవత్వాన్ని, సోదరభావాన్ని నమ్మి హుమాయున్‌కు ఒక రాఖీని పంపింది.

ఆ రాఖీని అందుకోగానే హుమాయున్ చలించిపోయాడు. మొఘల్ సామ్రాజ్య చక్రవర్తి అయినప్పటికీ, ఒక సోదరి పంపిన దారానికి విలువనిచ్చి, తన సైన్యంతో బయలుదేరి ఆమెను కాపాడటానికి తరలివెళ్లాడు. మతాలు, దేశాల సరిహద్దులను దాటిన ఈ ఘటన రక్షాబంధన్‌ను ఒక విశ్వజనీన మానవతా పండుగగా నిలబెట్టింది.


**గణేశుని ఇంట మానస, సంతోషి మాతల ఉద్భవం**

పురాణాల ప్రకారం, వినాయకుని చెల్లెలు మానసదేవి శ్రావణ పౌర్ణమి నాడు వచ్చి అన్నకు రాఖీ కట్టింది. అది చూసిన వినాయకుని కుమారులు శుభ్, లాభ్ తమకూ ఒక చెల్లెలు కావాలని పట్టుబట్టారు. అప్పుడు గణేశుడు తన దివ్యశక్తితో, భార్యలు రిద్ధి సిద్ధుల నుంచి వెలువడిన పవిత్ర జ్వాలల ద్వారా 'సంతోషి మాత'ను సృష్టించాడు. ఆ విధంగా కుటుంబంలో అనురాగాల పందిరి మరింత విస్తరించింది.

**కాలం మారినా మారని అనుబంధం**

నాటి దారపు పోగుల నుంచి నేటి ఆధునిక రంగుల రాఖీల వరకు రూపాలు మారవచ్చు గాక! కానీ, ఆచారాల వెనుక ఉన్న ఆంతర్యం మాత్రం ఒక్కటే. ఒక సోదరుడు తన సోదరిని కంటికి రెప్పలా కాపాడుతానని ఇచ్చే మాటే ఈ పండుగ అసలైన సారం. భౌగోళిక దూరాలు ఎంత ఉన్నా, టెక్నాలజీ సాయంతో ఆన్‌లైన్‌లో రాఖీలు పంపుతూ నేటి తరాలు కూడా ఈ పవిత్ర బంధాన్ని సజీవంగా ఉంచుతున్నాయి.


కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా, హృదయాలను హృదయాలతో కలిపే ఈ శ్రావణ పౌర్ణమి పండుగ.. ప్రతి ఇంట్లోనూ నవ్వుల పువ్వులను పూయిస్తూ, మానవ సంబంధాల మాధుర్యాన్ని తరతరాలకు అందిస్తూనే ఉంటుంది.






**రాఖీ అంటే రక్ష!**

తమ సోదరులకు ఎలాంటి ఆపదలు, అవాంతరాలు లేకుండా జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని కోరుకుంటూ ప్రతి ఆడపడుచు తన అన్నదమ్ములకు కట్టే 'రక్ష'ను రాఖీ అంటారు. తమ శ్రేయస్సును, అభ్యున్నతిని కోరుకునే అక్క చెల్లెళ్లకు రాఖీ పండుగ శుభ సందర్భంగా అన్నదమ్ములు కానుకలిచ్చి సంతోష పెట్టడం ఆనవాయితీగా వస్తోంది. అన్నదమ్ములు అక్కాచెల్లెళ్లకు రక్షణగా ఉండాలి. ఆడపడుచులు ప్రేమానుబంధాలు పంచి ఇవ్వాలనే సదుద్దేశ్యంతో జరుపుకునే ఈ పండుగ వారికి మాత్రమే కాదు వారిని కన్న తల్లిదండ్రులకు కూడా ఆనందాన్ని పంచి పెడుతుందనడంలో ఏమాత్రం సందేహం లేదు. రానున్న రాఖీ పండుగను మనం కూడా ఆనందంగా జరుపుకుందాం. ఆప్యాయత అనురాగాలు పెంచుకుందాం.













# విషాదాన్ని కౌగిలించుకున్న వేళ... విశ్వగురువై నిలిచిన భారతం!



"అపకారికి నుపకారము నెపమెన్నక సేయువాడె నేర్పరి సుమతీ!" అన్న బద్దెన పద్యానికి నేటి భారత దేశ విదేశాంగ విధానం, విపత్తు స్పందన సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. నేపాల్‌ను ముంచెత్తిన ప్రకృతి ప్రకోపం, ఆ దేశాన్ని చిగురుటాకులా వణికిస్తున్న వేళ, భారతదేశం అందిస్తున్న ఆపద్బాంధవ హస్తం మన సనాతన ధర్మపు ఔన్నత్యాన్ని ప్రపంచ వేదికపై సగర్వంగా నిలబెట్టింది. టిబెట్ సరిహద్దుల నుండి దూసుకొచ్చిన జలప్రళయం నేపాల్‌ను అతలాకుతలం చేసి, వందలాది ప్రాణాలను బలిగొని, మౌలిక వసతులను తుడిచిపెట్టేసిన ఈ విషాద సమయంలో, ఆ దేశం ఇటీవల చేసిన రాజకీయ ద్రోహాన్ని, విషపు వ్యాఖ్యలను పక్కనబెట్టి అక్కున చేర్చుకున్న ఏకైక దేశం భారత్. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం, విపత్తు వార్త విన్న మరుక్షణమే స్పందించి, పాత పగలను మనసులో పెట్టుకోకుండా హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టిన తీరు ప్రతి భారతీయుడి గర్వకారణం.

దశాబ్దాలుగా నేపాల్‌కు కష్టం వస్తే ముందుగా కన్నీరు పెట్టేది భరతమాతే అన్నది చారిత్రక సత్యం. భూకంపాలు కుదిపేసినా, ఆర్థిక సంక్షోభాలు చుట్టుముట్టినా, ఆహారం, మందులు అందించి ఆప్యాయంగా ఆదుకున్న చరిత్ర మనది. కానీ, పాలుపోసిన చేతినే కాటేసే పాము చందంగా ఇటీవల నేపాల్ పాలకులు కృతఘ్నతను ప్రదర్శించారు. స్వార్థ రాజకీయాల కోసం, భారత వ్యతిరేక శక్తుల ప్రోద్బలంతో, ముఖ్యంగా డ్రాగన్ కంట్రీ చైనాతో అంటకాగుతూ మన దేశంపైనే నిప్పులు చెరిగారు. మన సరిహద్దుల్లో ఉంటూ, మన శత్రువులతో స్నేహం చేస్తూ నేపాల్ ఆడిన కపట నాటకాలు చూసి భారతీయ సమాజం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వీరికి ఇకపై ఎటువంటి సహాయం చేయకూడదన్న డిమాండ్లు సైతం దేశవ్యాప్తంగా వెల్లువెత్తాయి. కానీ, నేపాల్‌ను జలసమాధి చేసిన వరదలు చైనా అధీనంలోని టిబెట్ నుంచే వచ్చినా, ఆపద సమయంలో ఆ చైనా ఏమాత్రం కనికరం చూపకుండా ముఖం చాటేయడం కమ్యూనిస్ట్ దేశపు కపటత్వాన్ని బట్టబయలు చేసింది. అగ్రరాజ్యం అమెరికా జాడ లేదు. పెద్ద పెద్ద భవనాలు కూలిపోయి, ప్రజలు నిరాశ్రయులై హాహాకారాలు చేస్తున్న దయనీయ స్థితిలో 'మేమున్నాం' అంటూ అభయహస్తం ఇచ్చింది మోదీ ప్రభుత్వమే.

"అయం నిజః పరో వేతి గణనా లఘుచేతసామ్, ఉదారచరితానాం తు వసుధైవ కుటుంబకమ్"

అన్న ఉపనిషత్ వాక్యం నేటి భారత విపత్తు నిర్వహణకు మూలస్తంభంగా నిలిచింది. శత్రువు ఇంటికి నిప్పంటుకుంటే చలి కాచుకునే పైశాచికత్వం మనది కాదు, ఆత్మీయత అనే నీళ్లు పోసి ఆర్పే గొప్ప మానవత్వం మనది. అందుకే, పొరుగు దేశం కష్టాన్ని చూసి చలించిపోయిన భారత్, పది టన్నుల అత్యవసర సామాగ్రిని, ప్రాణరక్షక మందులను యుద్ధప్రాతిపదికన పంపించి తన విశాల హృదయాన్ని చాటుకుంది. రాజకీయ పబ్బం గడుపుకోవడానికి కృతక శత్రువులను సృష్టించుకునే నేపాల్ పాలకులు, ఆపదలో ప్రాణాలు నిలబెట్టే నిజమైన మిత్రుడెవరో, పక్కనుండి గోతులు తవ్వే అవకాశవాద శక్తులెవరో ఇప్పటికైనా గ్రహించాలి. అపకారికి సైతం ఉపకారం చేస్తూ, ఆదుకునే ఆపద్బాంధవుడిగా నిలబడిన ఈ ఘట్టం, విశ్వగురువుగా ఎదుగుతున్న భారత చరిత్రలో ఒక సువర్ణాక్షర లిఖితం.

**(గడల నరసింహారావు, సీనియర్ జర్నలిస్ట్, ఖమ్మం)**



# ఖమ్మంలో బీజేపీ ఫైర్.!

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై కదం తొక్కిన కమలదళం
- ఉద్రిక్తంగా మారిన జెడ్పీ సెంటర్ ఆందోళన.
- పోలీసుల ఈడ్చివేత, నెల్లూరి కోటేశ్వరరావు సహా నేతల అరెస్ట్
- విద్యార్థుల భవిష్యత్తుతో సర్కారు చెలగాటం
- నిధులు ఇవ్వకుంటే మంత్రులను రోడ్లపైనే అడ్డుకుంటాం
- బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు.

**ఖమ్మం, మహా :** రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం నగరంలో భారతీయ జనతా పార్టీ చేపట్టిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం జెడ్పీ సెంటర్ వద్ద పార్టీ శ్రేణులు కదం తొక్కాయి. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం పెరిగి తోపులాటకు దారితీసింది. పరిస్థితి అదుపుతప్పడంతో రోడ్డుపై బైఠాయించిన నాయకులను పోలీసులు బలవంతంగా ఈడ్చుకు వెళ్లి అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించడంతో ఖమ్మం జెడ్పీ సెంటర్ రణరంగాన్ని తలపించింది.విద్యార్థుల పక్షాన అలుపెరగని పోరాటం చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. వద్దురా నాయనా కాంగ్రెస్ పాలన, దొంగల రాజ్యం.. దోపిడీ రాజ్యం అంటూ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ఈ సందర్భంగా పోలీసుల వలయాన్ని ఛేదించుకుని ముందుకు వెళ్లేందుకు యత్నించిన ఆందోళనకారులను బలవంతంగా అదుపులోకి తీసుకుని పోలీస్ వాహనాల్లో ఎక్కించారు. ఈ అరెస్టుల పర్వంతో ఖమ్మం నగరంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. పేద, మధ్య తరగతి విద్యార్థుల ఉన్నత చదువుల ఆకాంక్షను రాష్ట్ర ప్రభుత్వం దారుణంగా నీరుగారుస్తోందని ఆయన మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సాధన కోసం బీజేపీ గత నెల రోజులుగా అలుపెరగని పోరాటం చేస్తోందని గుర్తుచేశారు. బకాయిలు పేరుకుపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 లక్షల కుటుంబాలు తీవ్ర మనోవేదనకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎనిమిదేళ్లుగా కళాశాలలకు కనీస నిర్వహణ నిధులు అందక, విద్యాసంస్థలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయని స్పష్టం చేశారు. ఫీజులు చెల్లించనిదే విద్యార్థులకు యాజమాన్యాలు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో చదువు పూర్తయినా ఉద్యోగాలకు వెళ్లలేక యువత రోడ్డున పడుతోందని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు.పాలిటెక్నిక్ కళాశాలలను సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకుందామనుకున్న నాయకులను నిజాం కాలం నాటి తరహాలో గృహనిర్బంధాలు చేయడం, అక్రమంగా అరెస్టులు చేయడం ఈ ప్రభుత్వ నిరంకుశత్వానికి పరాకాష్ట అని కోటేశ్వరరావు ధ్వజమెత్తారు. పాలకులు తమ స్వలాభం కోసం రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్నారని, విద్యార్థుల భవిష్యత్తును గాలికి వదిలేశారని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే కళ్లు తెరిచి పెండింగ్ బకాయిలను విడుదల చేయకపోతే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులను సైతం రోడ్ల మీద తిరగనివ్వబోమని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. పరిపాలన చేతకాకపోతే తక్షణమే ప్రభుత్వాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థి లోకం కన్నెర్రజేస్తే కాంగ్రెస్ సర్కారు ఆ యువత ఆగ్రహ జ్వాలల్లో కాలిపోక తప్పదని ఆయన స్పష్టం చేశారు. దేశంలో డబుల్ ఇంజిన్ సర్కార్ అండ ఉన్న రాష్ట్రాల్లోనే ప్రజలు సుఖసంతోషాలతో, అభివృద్ధి పథంలో పయనిస్తున్నారని, తెలంగాణలోనూ ఆ మార్పు రావాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా కోటేశ్వరరావు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో శ్యామ్ రాథోడ్, నున్న రవి కుమార్ , అల్లిక అంజయ్య, కొణతం లక్ష్మీ నారాయణ, నకిరేకంటి వీరభద్రం, శ్రీరామనేని మణి , మంద సరస్వతి ,శాసనాల సాయిరాం, పమ్మి అనిత, ఆర్ వి ఎస్ యాదవ్, రుద్ర గాని మాధవ్ బి.కొండ శ్యామ్, శ్రీ లక్ష్మి రెడ్డి, ఫణి కుమారి, స్వర్ణ, భద్రం , గోనెల శివ తదితరులు పాల్గొన్నారు.

# ప్లీజ్.. బెనిఫిట్స్ ఇవ్వండి..

- పిఆర్సి అమలు చేయాలి
- పెండింగ్ బిల్స్ ను విడుదల చేయాలి
- జేఏసీ నాయకుల డిమాండ్
- కలెక్టరేట్ వద్ద మహాధర్నా సక్సెస్




**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** మాకు రావాల్సిన బెనిఫిట్స్ తక్షణమే చెల్లించాలని పలువురు ఉద్యోగులు డిమాండ్ చేయడం జరిగింది. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న బిల్స్ను వెంటనే విడుదల చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గత ప్రభుత్వం కూడా బెనిఫిట్స్ ఇవ్వడంలో నిర్లక్ష్యం చూపిందన్నారు కనీసం కాంగ్రెస్ ప్రభుత్వం అయినా స్పందించి మా బెనిఫిట్స్ మాకు ఇవ్వాలని వేడుకున్నారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ప్రక్కనున్న ధర్నా చౌక్ వద్ద తెలంగాణ ఉద్యోగులు గెజిటెడ్ అధికారులు ఉపాధ్యాయులు కార్మికులు అండ్ పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటి కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొని తమ గోడును వెల్లబోసుకున్నారు. ఈ సందర్భంగా టీజేఈ జేఏసీ జిల్లా చైర్మన్ అమరనేని రామారావు, కన్వీనర్ సంగం వెంకట పుల్లయ్యలు మాట్లాడుతూ పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని లేకుంటే దశలవారీగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. 2వ పిఆర్సి అమలు చేయడంతో పాటుగా ఆరు డిఏలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్ అమలుచేయాలన్నారు. ఉద్యోగుల పెండింగ్ బిల్స్ 2000 కోట్లు ప్రతి నెల విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల హెల్త్ స్కీంను పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం అవుతుందన్నారు. వచ్చే నెల కూడా హైదరాబాదులో మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమానికి ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులు జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి..**

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల న్యాయపరమైన దీర్ఘకాలిక డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా డిమాండ్ చేశారు. తెలంగాణ పంచాయతీరాజ్ మినిస్ట్రియల్ ఉద్యోగుల సంఘం ఇచ్చిన రాష్ట్రవ్యాప్త ధర్నా కార్యక్రమాల పిలుపులో భాగంగా గురువారం భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట పంచాయతీ కార్యదర్శులు ఉద్యోగులు చేపట్టిన మహాధర్నాకు ఆయన హాజరై సంపూర్ణ సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని అలాంటి వారి సమస్యలను పరిష్కరించడంలో పాలకులు నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. 2వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేసి ఉద్యోగులను ఆదుకోవాలని కోరారు. ఉద్యోగుల జీవితాలకు భద్రత లేని సీపీఎస్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని, పూర్తిస్థాయి ఉద్యోగుల ఆరోగ్య పథకం(ఈహెచ్ఎస్)ను పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన పోరాటాలకు సిపిఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాలు పలువురు పాల్గొన్నారు.



# మణుగూరులో యువకుల మధ్య ఘర్షణ..

- యువకుడు సింహాద్రి శివ మృతి..
- స్టోర్ గ్రౌండ్‌లో రెండు వర్గాల మధ్య వివాదం
- ఘర్షణలో 30 నుంచి 40 మంది పాల్గొన్నట్లు సమాచారం
- సీఐ నాగబాబు, ఎస్సై నగేష్ ఆధ్వర్యంలో దర్యాప్తు

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలోని సింగరేణి ఏరియా స్టోర్ గ్రౌండ్ (క్రీడా మైదానం) లో గురువారం రాత్రి యువకుల మధ్య జరిగిన ఘర్షణలో సింహాద్రి శివ (28) మృతి చెందిన ఘటన కలకలం రేపింది. రెండు వర్గాలకు చెందిన సుమారు 30 నుంచి 40 మంది యువకులు ఘర్షణలో పాల్గొన్నట్లు ప్రాథమిక సమాచారం. అయితే ఘటనలో పాల్గొన్న వారి సంఖ్య, వివరాలను పోలీసులు అధికారికంగా నిర్ధారించాల్సి ఉంది. అందిన సమాచారం ప్రకారం.. శివ వద్ద పనిచేసే ఓ వర్కర్‌కు కొందరు యువకులతో ఏర్పడిన వివాదమే ఘటనకు దారితీసినట్లు తెలుస్తోంది. ఈ వివాదం నేపథ్యంలో శివను స్టోర్ గ్రౌండ్‌కు పిలిపించగా అక్కడ ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసినట్లు సమాచారం. ఈ క్రమంలో శివపై పలువురు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. శివపై దాడికి పాల్పడిన వారిని ఎంకే గ్యాంగ్ గా పిలుస్తారని కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. అయితే ఈ ఆరోపణలపై పోలీసుల నుంచి అధికారిక ధృవీకరణ రావాల్సి ఉంది. ఘర్షణకు అసలు కారణమేమిటి, ఎంతమంది పాల్గొన్నారు, శివపై దాడికి పాల్పడిన వారెవరు అనే కోణాల్లో పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. యువకుడి మృతితో అతని కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. మనుగూరు సీఐ నాగబాబు, ఎస్సై నగేష్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



# గడప గడపకు తెలంగాణ రక్షణసేన

**దమ్మపేట,మహా :** గడపగడపకు రక్షణ సేన పార్టీ మానిఫెస్టో కార్యక్రమాన్ని అశ్వారావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ సోడెం వెంకట్ గురువారం చేపట్టారు. పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఇచ్చిన పిలుపులో భాగంగా తెలంగాణ రక్షణసేన మేనిఫెస్టోను గడప గడపకు కార్యక్రమం చేపడుతున్నామని పార్టీ ఇన్చార్జ్ వెంకట్ తెలిపారు. ఇందులో భాగంగా దమ్మపేట మండలంలోని మల్లారం, వైబీఆర్ నగర్ ప్రాంతాల్లో ప్రజలను కలుసుకుని తెలంగాణ రక్షణసేన మేనిఫెస్టోలోని అంశాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, రాబోయే రోజుల్లో ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై వివరించారు.అలాగే టి ఆర్ ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్తగా ప్రవేశపెట్టిన “భూ లక్ష్మి” పథకం గురించి ప్రజలకు వివరించి, ఆ పథకం ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలపై సరైన సమాచారం అందించడంతో పాటు, ప్రతి కుటుంబానికి మేనిఫెస్టోలోని అంశాలు చేరేలా గడప గడపకు ప్రచారం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని అన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



# దివ్యాంగ బాలబాలికలకు ఆటల పోటీలు

- విజేతలకు బహుమతులు ప్రధానం

**జూలూరుపాడు, మహా:**మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఐదు నుండి పదిఏడు సంవత్సరాల లోపు దివ్యాంగ బాలబాలికలకు మండల స్థాయి ఆటల పోటీలను గురువారం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలబాలికలకు జిగ్ జాగ్ వాక్, డక్ వాక్, ఫ్రాగ్ జంప్, చెస్, క్యారంస్, పరుగు పందెం వంటి పలు రకాల ఆటలను నిర్వహించారు. అనంతరం విజేతలతో పాటు పోటీలలో పాల్గొన్న విద్యార్థులందరికీ బహుమతులతో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులను జిల్లా స్థాయి ఆటలకు సిఫారస్ చెయ్యనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు పండ్లు, భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి జుంకీలాల్, హెచ్ఎం టి లక్ష్మీనరసయ్య, ప్రత్యేక విద్య ఉపాధ్యాయులు జి నాగరమేష్, ఐఆర్పిలు ఆర్ సాంబశివరావు, జె శ్రీనివాస్, పాపకొల్లు ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్కె మీరా సాహెబ్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

# సీతమ్మ సాగర్ జలాల మణుగూరును సస్యశ్యామలం చేయాలి

**కాంగ్రెస్ జిల్లా నేత దొబ్బల వెంకటప్పయ్య**



**మణుగూరు, మహా :** సీతమ్మ సాగర్ ప్రాజెక్టు జలాలతో మణుగూరు మండలంలోని చెరువులు, కుంటలను నింపి సుమారు 2 వేల ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని మాజీ సర్పంచ్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి దొబ్బల వెంకటప్పయ్య కోరారు. ఈ డిమాండ్‌తో ఈ నెల 29న సీతమ్మ సాగర్ ప్రాజెక్టు వద్దకు రానున్న రాష్ట్ర వ్యవసాయ, సమాచార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు ఇతర మంత్రులకు రైతులతో కలిసి వినతిపత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఈ ప్రాంతం నుంచి గోదావరి జలాలు ఇతర ప్రాంతాలకు తరలిపోయేవని, ప్రస్తుతం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చొరవతో మారెళ్లపాడు లిఫ్ట్ ద్వారా తుమ్మల చెరువుకు నీరందించే కార్యక్రమం ప్రారంభానికి సిద్ధమైందన్నారు. ఇదే తరహాలో మనుగూరు మండల రైతాంగానికి శాశ్వత సాగునీటి వసతి కల్పించేలా సీతమ్మ సాగర్ జలాలను మండలంలోని ప్రధాన చెరువులకు మళ్లించాలని కోరారు. అశ్వాపురం మండలం నుంచి రేగులగండి చెరువుకు లిఫ్ట్ ఏర్పాటు చేసి, కూనవరం, మద్దులగూడెం, సింగారం గ్రామాల రైతులకు రెండు పంటలకు సాగునీరు అందించాలని పేర్కొన్నారు. అదేవిధంగా కట్టువాగు ద్వారా మనుగూరు పెద్ద చెరువును నింపి, అక్కడి నుంచి అన్నారం, కమలాపురం, చిన్నరావిగూడెం, సింగనగూడెం చెరువులకు నీటిని అనుసంధానం చేయాలని కోరారు. ఈ పనులు పూర్తయితే మణుగూరు మండలంలో భూగర్భ జలమట్టాలు పెరగడంతో పాటు సుమారు 2 వేల ఎకరాలకు సాగునీటి భరోసా లభిస్తుందని, తాగునీటి సమస్య కూడా పరిష్కారమవుతుందని వెంకటప్పయ్య పేర్కొన్నారు. సీతమ్మ సాగర్ జలాలు మణుగూరు రైతాంగానికి పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టాలని కోరారు. ఈ నెల 29న మంత్రులకు వినతిపత్రం సమర్పించే కార్యక్రమానికి మణుగూరు మండలంలోని రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రైతాంగ ఆకాంక్షను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వెంకటప్పయ్య పిలుపునిచ్చారు.

# పోలీసుల అదుపులో గంజాయి రాయుళ్లు

- డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలింపు
- ముత్తుపదార్థులకు దూరంగా ఉండాలి
- త్రీటౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** కొత్తగూడెం త్రీ టౌన్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సేవిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు గుర్తించి గురువారం అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన ఇద్దరు వ్యక్తులపై చట్టపరమైన ప్రక్రియను పూర్తి చేసి వారిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. మత్తు పదార్థాల వినియోగం నుంచి వారిని బయటకు తీసుకువచ్చి సాధారణ జీవన విధానంలోకి తీసుకురావాలనే ఉద్దేశంతో మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు వారిని డీఅడిక్షన్ సెంటర్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్ఓ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్ఓ ఇంద్రసేన రెడ్డి మాట్లాడుతూ యువత గంజాయి ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై తల్లిదండ్రులు తమ పిల్లలకు అవగాహన కల్పించాలని వారి ప్రవర్తనపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని కోరారు. అదేవిధంగా గంజాయి ఇతర మత్తు పదార్థాల విక్రయం సరఫరా రవాణా వినియోగానికి పాల్పడే వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మత్తు పదార్థాలకు బానిసైన వారిని కేవలం శిక్షించడం మాత్రమే కాకుండా అవసరమైన సందర్భాల్లో చికిత్స పునరావాసం అందించడం ద్వారా వారిని తిరిగి సాధారణ జీవన విధానంలోకి తీసుకురావడానికి పోలీస్ శాఖ కృషి చేస్తుందని తెలిపారు. మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రజలు పోలీసులకు సహకరించాలని, గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ విక్రయం సరఫరా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్‌హెచ్ఓ ఇంద్రసేన రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# పారిశుధ్య కార్మికుల కొరతపై ఎమ్మెల్యేను కలిసిన కార్మికులు

- గత కొంతకాలంగా పారిశుద్ధ కార్మికుల నియామకాలను నిలిపివేసిన ప్రభుత్వం



**కుషాయిగూడ, మహా :** నియోజకవర్గ పరిధిలో. కాప్రా. నాచారం. ఉప్పల్ సర్కిల్లో పారిశుధ్య కార్మికుల సంఖ్య తక్కువగా ఉండటంతో పనిభారం పెరిగి ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు పారిశుధ్య కార్మికులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి తమ సమస్యను వివరించారు. మూడు మున్సిపాలిటీ సర్కిలలో పారిశుద్ధ కార్మికుల కొరత కొట్టొచ్చినట్లు ఉందని తక్షణమే పారిశుద్ధ కార్మికులను నియమించాలని తమ గోడును వెల్లబోసుకున్నారు.ప్రస్తుతం కార్మికుల కొరత కారణంగా పారిశుధ్య నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన సంఖ్యలో సిబ్బందిని ఏర్పాటు చేయాలని కోరారు. తగిన విధంగా పారిశుద్ధ కార్మికులు లేకపోవడం వల్ల ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉండిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు కలెక్టర్ హైదరాబాద్ లో చెత్త కనిపించకూడదని మున్సిపల్ అధికారులు ఆదేశాలిస్తున్నప్పటికీ మరోవైపు చెత్తాచెదారం. ఎక్కడపడితే అక్కడ నిల్వ ఉండడం దుర్వాసన వ్యాప్తిస్తుందని ఆయా కక్క కాలనీల ప్రజలు పరిశుద్ధ కార్మికులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత కొంతకాలంగా జిహెచ్ఎంసి పరిధిలో పరిశుద్ధ కార్మికుల నియమాకాలను ప్రభుత్వం నిలిపివేసింది. రోజురోజుకు శివారు మున్సిపాలిటీలలో కలనీల సంఖ్యలు పెరిగిపోతున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుండి వలసలు పెరిగాయి. కొత్త కొత్త కాలనీలు పుట్టుకరావడంపై మున్సిపాలిటీలలో సరి అయిన సిబ్బంది లేకపోవడం వల్ల మున్సిపాలిటీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.కార్మికుల సమస్యలను సానుకూలంగా విన్న ఎమ్మెల్యే పారిశుద్ధ కార్మికుల సమస్యపై మల్కాజ్గిరి మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకునేలా చూస్తానని హామీ ఇచ్చారు. పరిశుద్ధా కార్మికులకుప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుధ్య సేవలు నిరంతరం కొనసాగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి సూచించారు.

# పుట్టగొడుగుల పెంపకంపై ఉచిత శిక్షణ

- పాలకుర్తి మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్



**పాలకుర్తి, ఆగస్టు 25 మహా** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండల రైతులకు పుట్టగొడుగుల పెంపకంపై ఉచిత ఆచరణాత్మక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. పాలకుర్తి వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం ఆగస్టు 27న ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పాలకుర్తి రైతు వేదికలో నిర్వహించనున్నారు.పుట్టగొడుగుల పెంపకం విధానం, అనుకూల వాతావరణ పరిస్థితులు, సబ్‌స్ట్రేట్ మరియు స్పాన్ తయారీ, వివిధ రకాల పుట్టగొడుగుల సాగు, సంరక్షణ, మార్కెటింగ్ తదితర అంశాలపై నిపుణులు ప్రత్యక్ష ఆచరణాత్మక శిక్షణ అందించనున్నారు. పుట్టగొడుగుల పెంపకం ద్వారా స్వయం ఉపాధి, అదనపు ఆదాయ అవకాశాలపై కూడా అవగాహన కల్పించనున్నారు.ఈ శిక్షణకు ముందుగా నమోదు చేసుకున్న 25 మంది రైతులకు మాత్రమే అవకాశం కల్పించనున్నారు. మహిళా రైతులు, నిరుద్యోగ యువత, స్వయం సహాయక సంఘాల సభ్యులు, స్వయం ఉపాధి కోరుకునే వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. శిక్షణలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ధ్రువీకరణ పత్రం అందజేయనున్నారు. ఆసక్తి ఉన్న రైతులు తమ పేర్లను ముందుగా నమోదు చేసుకోవడానికి సంబంధిత గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి ఏఈఓ లేదా పాలకుర్తి రైతు వేదికను సంప్రదించాలని అధికారులు సూచించారు. సీట్లు పరిమితంగా ఉన్నందున ముందస్తు నమోదు తప్పనిసరి అని, శిక్షణ పూర్తిగా ఉచితమని తెలిపారు.

# ప్రతీ గ్రామం పచ్చదనం, పరిశుభ్రంగా ఉండాలి

- ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ, మహా ;**హనుమకొండ జిల్లా లోని ప్రతీ గ్రామం పచ్చదనం, పరిశుభ్రంగా ఉండాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు గురువారం కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ ఆత్మకూరు మండలంలో పర్యటించారు. ముందుగా కొత్తగట్టు గ్రామం లో సెగ్రిగెషన్ షెడ్ ద్వారా చేస్తున్న సేంద్రియ ఎరువు తయారీని పరిశీలించారు. ఇప్పటివరకు తయారైన ఎరువును విక్రాయించారా లేదా అని, అలాగే దాని ద్వారా వచ్చిన ఆదాయన్ని గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ వంట తయారీని పరిశీలించారు. పిల్లలు ఎంత మంది హాజరయ్యారని అడిగి తెలుసుకొని... అక్కడ ఉన్న పిల్లలను వివిధ రకాల పండ్ల పేర్లను అడిగి కేంద్రం లో వారికి నేర్పిస్తున్న బోధనా విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. చిన్నప్పటి నుంచే పిల్లలకి నేర్చుకోవాలన్న తపన కలగాలి అంటే.. అంగన్వాడీ కేంద్రం లో టీచర్లు ఆసక్తి కలిగేలా వివిధ రకాల ఆటపాటలతో కూడిన పాఠ్యాంశాలను బోధించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలోని 3వ తరగతిని సందర్శించి గణితం లోని కొన్ని లెక్కలను ఇచ్చి వాటిని ఆ విద్యార్థులు ఏవిధంగా చేస్తారు అని వారి అభ్యసన సామర్థ్యాన్ని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం పాఠశాల పరిసరాలను పరిశీలించి.... టాయిలెట్స్ ని ప్రతీరోజు శుభ్రం గా ఉండేలా చూసు కోవాలన్నారు. నీటి వసతి, ఆర్వో ప్లాంట్ పని తీరును కుడా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదే గ్రామం లో నిర్మించిన ఫామ్ పౌండ్ ను కలెక్టర్ పరిశీలించారు. గ్రామానికి చెందిన వీరబోయిన అశోక్ తన స్థలం లో నిర్మించ తలపెట్టిన ఫామ్ పౌండ్ కి భూమి పూజ చేశారు. తదనంతరం కలెక్టర్ గ్రామం లో కలియ తిరిగి సోక్ పిట్స్, టాయిలెట్స్ ఉన్నాయా లేవా అని, అలాగే గ్రామం లో నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ఇంటికి సోక్ పిట్, టాయిలెట్ ఉండాలని అలాగే ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని కలెక్టర్ గ్రామస్తులకు తెలిపారు . వన మహోత్సవం లో భాగం గా అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులతో కలిసి కలెక్టర్ మొక్కలను నాటారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీజ, డిఆర్డీఓ మేన శ్రీను, డిపిఓ లక్ష్మీ రమాకాంత్, ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## కూనారంలో ఓటర్ల ప్రత్యేక సవరణపై గ్రామసభ

- **డబుల్ ఓట్లు చట్టవిరుద్ధం.. ప్రతి పౌరుడికి ఒకే ఓటు ఉండాలి.!**
- **157 డబుల్ ఓట్లు, మరణించిన వారి ఓట్లు గుర్తింపు – తహసీల్దార్ రాముడు!**

**పెద్దపల్లి , మహా :** పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండల పరిధిలోని కూనారం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఓటర్ల ప్రత్యేక సవరణ కార్యక్రమంపై గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీరాంపూర్ తహసీల్దార్ రాముడు, గ్రామ సర్పంచ్ మంతెన రాజయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఓటర్ల జాబితాకు సంబంధించిన వివరాలను అధికారులు ప్రజలకు వెల్లడించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాముడు మాట్లాడుతూ.. భారత చట్టాల ప్రకారం ప్రతి పౌరుడికి ఒకే ఓటు హక్కు ఉంటుందని, ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటరుగా నమోదు కావడం చట్టవిరుద్ధమని తెలిపారు. ఓటర్లు తమ వివరాలను పరిశీలించుకుని, ఎక్కడైనా ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు నమోదు అయి ఉంటే సంబంధిత అధికారులకు సమాచారం అందించి ఒకే చోట ఓటును కొనసాగించుకోవాలని సూచించారు. కూనారం గ్రామంలో ప్రస్తుతం 2,400కు పైగా ఓట్లు ఉన్నాయని తహసీల్దార్ తెలిపారు. ఓటర్ల ప్రత్యేక సవరణలో భాగంగా 157 డబుల్ ఓట్లు, మరణించిన వ్యక్తులకు సంబంధించిన ఓట్లు గుర్తించి తొలగించినట్లు వివరించారు. అదేవిధంగా 25 నాన్‌మ్యాపింగ్ ఓట్లు గుర్తించినట్లు తెలిపారు.డబుల్ ఓట్లు, నాన్‌మ్యాపింగ్ ఓట్లకు సంబంధించి గ్రామపంచాయతీ కార్యాలయంలో నోటీసులు అందుబాటులో ఉంచడంతో పాటు, సంబంధిత ఓటర్లకు కూడా నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న వారు తమ వద్ద ఉన్న ఆధారాలతో నిర్ణీత సమయంలో అధికారులను సంప్రదించి వివరాలను సరిచేసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా, తప్పులు లేకుండా ఉండేందుకు ప్రజలు అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా, అనర్హమైన లేదా పునరావృతమైన పేర్లు తొలగించేలా SIR ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. గ్రామసభలో ప్రజలు తమ ఓటర్ల జాబితాకు సంబంధించిన వివరాలను పరిశీలించుకుని, ఏవైనా అభ్యంతరాలు లేదా సవరణలు అవసరమైతే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు.

# డిజిటల్ క్రాప్ సర్వేతో రైతులకు మేలు

**2026 వానాకాలం సాగు వివరాల సేకరణకు ఏర్పాట్లు**



**దమ్మపేట, మహా:** రైతులు సాగు చేస్తున్న పంటలను వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన సూచనలు, సలహాలు అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయ శాఖ ఏడీఏ రవికుమార్, మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో డిజిటల్ క్రాప్ సర్వే పనులను వారు పరిశీలించారు .ఈ సందర్భంగా ఏఓ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులు ఏ పంటను, ఎంత విస్తీర్ణంలో, ఎక్కడ సాగు చేస్తున్నారనే వివరాలను జియో ట్యాగింగ్, జియో రిఫరెన్సింగ్ ద్వారా డిజిటల్‌గా నమోదు చేయడమే డిజిటల్ క్రాప్ సర్వే అని తెలిపారు. దీనివల్ల పంటల నమోదు ప్రక్రియ మరింత పారదర్శకంగా, వేగంగా, ఖచ్చితంగా జరుగుతుందన్నారు.2026 వానాకాలంలో సాగు చేసిన పంటల క్రాప్ బుకింగ్ కోసం వ్యవసాయ శాఖ సన్నద్ధమైందన్నారు. గ్రామాల్లో సర్వే వాలంటీర్ల ద్వారా ఈ ప్రక్రియ నిర్వహిస్తామని, ఏఈఓల పర్యవేక్షణలో యాప్ ద్వారా పంటల వివరాలను నమోదు చేస్తామని తెలిపారు.

**డిజిటల్ క్రాప్ సర్వే ముఖ్య ఉద్దేశాలు**

రైతులు సాగు చేస్తున్న పంటల విస్తీర్ణాన్ని ఖచ్చితంగా నమోదు చేయడం. రైతు, భూమి, పంట వివరాలను డిజిటల్ డేటాబేస్‌లో అనుసంధానం చేయడం.

వాస్తవ సాగుపై నమ్మకమైన గణాంకాలను సేకరించడం. ప్రభుత్వ పథకాలు, ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన సమాచారాన్ని అందించడం. ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల అవసరాన్ని ముందుగానే అంచనా వేయడం.

**రైతులకు ప్రయోజనాలు:**

ప్రభుత్వ వ్యవసాయ పథకాల ప్రయోజనాలను వాస్తవ సాగు ఆధారంగా అందించే అవకాశం పెరుగుతుందని అధికారులు తెలిపారు. పంట కొనుగోళ్లు, పంట నష్టం, బీమా, సహాయక చర్యల్లో ఈ డిజిటల్ సమాచారం ఉపయోగపడుతుందన్నారు. పంట సాగుకు సంబంధించిన డిజిటల్ రికార్డు కూడా అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.2026 వానాకాలం పంటల నమోదు కోసం డిజిటల్ క్రాప్ సర్వే ఈ నెల 20 నుంచి ప్రారంభమైందని తెలిపారు. రైతులు తమ సమీపంలోని ఏఈఓలను సంప్రదించి సర్వే పూర్తయ్యేలా చూసుకోవాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో మినుము, పెసర, కంది, మొక్కజొన్న, వేరుశనగ, కూరగాయలు వంటి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసే రైతులు తప్పనిసరిగా క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని కోరారు.క్షేత్రస్థాయి పరిశీలనలో ఏఈఓలు వినోద్ కుమార్, అను బాబు, సర్వే వాలంటీర్లు, మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు రవికుమార్ పాల్గొన్నారు.

## చెట్లు ..ప్రగతికి మెట్లు

ఆదిలాబాద్ మహా:పర్యావరణ పరిరక్షణలో మొక్కలు కీలక పాత్ర పోషిస్తాయని మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష అన్నారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలలో నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమానికి ఆమె హాజరై మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు.విద్యార్థులు తమ పాఠశాలలు, కళాశాలలతో పాటు తమ ఇళ్ల వద్ద కూడా మొక్కలు నాటాలని సూచించారు. పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవం వంటి ప్రత్యేక కార్యక్రమాలను పురస్కరించుకుని ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే అలవాటును పెంపొందించుకోవాలని కోరారు.పర్యావరణంలో మార్పుల కారణంగా వర్షపాతం ప్రభావితమవుతున్న నేపథ్యంలో పచ్చదనాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ



మొక్కలు నాటి సంరక్షించాలని ఆమె సూచించారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి సంరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మైనార్టీ వెల్ఫేర్ అధికారి డీఎండబ్ల్యూ కలీం, కళాశాల ప్రిన్సిపల్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, అవి కిరణ్ , శానిటేషన్ ఎస్ఐ శంకర్ , మున్సిపల్ కౌన్సిలర్లు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్, మున్సిపల్ అధికారులు, మైనార్టీ వెల్ఫేర్ అధికారులు, విద్యాశాఖాధికారులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## పాలకుర్తిలో ఉత్సాహంగా పుట్టగొడుగుల పెంపకం శిక్షణ

**పాలకుర్తి, మహా** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం వ్యవసాయ శాఖ మరియు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పుట్టగొడుగుల పెంపకంపై రైతులకు ఉచిత శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక మహిళా సర్పంచులు, మహిళా సంఘాల సభ్యులు, యువత మరియు పెద్ద సంఖ్యలో రైతులు ఉత్సాహంగా హాజరయ్యారు.ఈ శిక్షణా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా వ్యవసాయ అధికారి డి ఏ ఓ మాట్లాడుతూ. రైతులు కేవలం పంటల సాగుపైనే ఆధారపడకుండా, పుట్టగొడుగుల పెంపకం వంటి లాభసాటి అనుబంధ రంగాలను ఎంచుకుంటే అదనపు ఆదాయం పొందవచ్చని పిలుపునిచ్చారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న రైతులు,మహిళలకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ.స్థానిక మహిళలు ఈ సాగులో శిక్షణ పొందితే వారికి ప్రత్యేకంగా మార్కెటింగ్ ఏర్పాటు చేసి, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చేలా అన్ని విధాల సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. మొదటి విడతగా మహిళా సర్పంచులు, యువతకు శిక్షణ ఇచ్చి, వారి ద్వారా గ్రామాల్లో ఇతరులకు ఈ ఉపాధి మార్గాన్ని విస్తరించడమే తమ ధ్యేయమన్నారు. పీ జే టీ ఎస్ ఏ యూ శాస్త్రవేత్త డా. ఎం. రాజేంద్ర ప్రసాద్ పుట్టగొడుగుల యూనిట్ ప్రారంభం నుంచి విక్రయాల వరకు కావాల్సిన మెలకువలను సుదీర్ఘంగా వివరించారు. సబ్‌స్ట్రేట్ తయారీ, స్పాన్ విత్తనం తయారీ, అనుకూల వాతావరణం, సంరక్షణ పద్ధతులపై రైతులకు ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ ఎం. రాజేంద్రప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి బత్తిని శ్రీనివాస్, పెద్దపల్లి డీఏఓ కార్యాలయ సహాయ వ్యవసాయ సంచాలకులు జే. కాంతారావు, వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్, పాలకుర్తి, రాణాపూర్, జీడి నగర్, గుడిపల్లి, రామారావుపల్లి సర్పంచులు, ఏఈఓలు ఎం. సువర్ణరేఖ, కే. శ్రీకాంత్, రైతులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు



## ప్రాథమిక పాఠశాలలో బోధన స్థాయిలో పిల్లలకు అక్షరాస్యత సంఖ్యాజ్ఞానంలో గట్టి పునాది కల్పించేలా బోధన విధానం నేర్పాలి

- **విద్యార్థులు100% బోధనను అభ్యసించేలా**
- **ఉపాధ్యాయులు కృషి చేయాలి**
- **అడిషనల్ కలెక్టర్, కిరణ్మయి**

**రాజేంద్రనగర్ మహా ;** రంగారెడ్డి జిల్లా (స్థానిక సంస్థలు)అడిషనల్ కలెక్టర్ డా, కిరణ్మయి కొప్పిశెట్టి, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, శంషాబాద్ జిహెచ్ఎంసి పరిధిలోని సాతాంరాయిలో గురువారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మిక తనిఖీలు చేశారు. అడిషనల్ కలెక్టర్, జిల్లా విద్యాధికార్లు పాఠశాలల్లోని తరగతి గదులో జరుగుతున్న బోధన పద్ధతులను నిశితంగా పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తొలిమెట్టు రీమిడీయేషన్ బోధన పురోగతిని నేరుగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు కీలక సూచనలను చేశారు. విద్యార్థుల స్థాయి ఆధారిత అభ్యసనా సామర్థ్యాలను బట్టి వారిని గ్రూపులుగా విభజించి, వారి స్థాయికి తగిన విధంగా బోధన అందించాలన్నారు.చదువులో వెనుకబడిన పిల్లలపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి అని సూచించారు. పిల్లలు రాసేటప్పుడు చేసే తప్పులను సరిదిద్దుతూ, స్పష్టమైన అవగాహన కల్పించాలి, తెలుగు భాష సరిగ్గా రాని పిల్లలకు వారి మాతృభాషలో సూచనలు ఇస్తూ చదువు పట్ల ప్రోత్సాహాన్ని అందించాలనీ ఉపాధ్యాయులను ఆదేశించారు.తొలిమెట్టు రిమిడియేషన్ బోధన ద్వారా విద్యార్థులందరూ 100% అభ్యసనా సామర్థ్యాలను సాధించేలా కృషి చేయాలనీ ఉపాధ్యాయులు తమకు ఇచ్చిన లక్ష్యాలను నెరవేర్చాలన్నారు.ఈ తనిఖీ కార్యక్రమంలో శంషాబాద్ మండల విద్యాశాఖాధికారి లక్ష్మార్ నాయక్, హెచ్ఎం వెంకటయ్య, జెడ్పీహెచ్ఎస్ సాతం రాయి హెడ్‌మాస్టర్ లక్ష్మారెడ్డి, ఆర్‌పి రవికుమార్,మండల ఆపరేటర్ మజర్, పాఠశాల ఉపాధ్యాయుల,సిఆరపిలు తదితరులు పాల్గొన్నారు.



## సీఎంపీఎఫ్, పెన్షన్ సేవలను మరింత వేగం పెంచాలి

**మందమర్రి, మహా :** సింగరేణి కాలరీస్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు సీఎంపీఎఫ్,పెన్షన్ సేవలలోసేవలను మరింత వేగం పెంచుతున్నామని రీజినల్ కమిషనర్లు (రీజియన్2) వై.భరత్‌కుమార్, గోవర్ధన్ లు వెల్లడించారు. బుధవారం మందమర్రి జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో సీఎంపీఎఫ్ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లావాదేవీలన్నీ సికెర్స్ పోర్టల్ ద్వారానే నిర్వహిస్తున్నామని,కొత్త పెన్షన్ క్లెయిమ్‌లను వేగంగా పరిష్కరించేందుకు 'ప్రయాస్' విధానాన్ని అమలు చేస్తున్నామని వారు వివరించారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు 'జీరో పెండింగ్' లక్ష్యంగా క్లెయిమ్‌లను పరిష్కరిస్తున్నట్లు స్పష్టం చేశారు. పెండింగ్ పీఎఫ్, పెన్షన్ క్లెయిమ్‌లను త్వరగా క్లియర్ చేయాలని సంక్షేమాధికారులు కోరగా వారు సత్వరమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దళారుల ప్రమేయం లేకుండా కార్మికులకు నేరుగా సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వై. భరత్‌కుమార్‌ను స్థానిక ఏరియా అధికారులు శాలువాతో ఘనంగా సన్మానించారు. సమావేశంలో మందమర్రి జిఎం ఎన్ రాధాకృష్ణ, డీజీఎం అశోక్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, వివిధ గనుల సంక్షేమాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. .



## ముఖ్యమంత్రి సహాయనిధి ధరఖాస్తులను నేరుగా అధికారులకు అందజేసిన ఎమ్మెల్యే

**దమ్మపేట ,మహా :** నియోజకవర్గంలో నిరుపేద బలహీన రోగులకు వైద్య ఖర్చులు కోసం ఎదురుచూస్తున్న బాధిత రోగుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందజేయాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం మంజూరు చేసే నిధులను బాధితులకు సకాలంలో అందజేయాలని నేరుగా హైదరాబాద్ లోని సంబందిత అధికారులకు అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారె ఆదినారాయణ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఉన్న గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ప్రతిరోజు బాధిత కుటుంబ సబ్యులనుండి ధరఖాస్తులను స్వీకరించి ,ఆన్ లైన్ చేయించడమే కాకుండా నేరుగా ప్రభుత్వ అధికారులకు అందజేస్తూ తమ సేవలను విస్తరిస్తున్నట్లు తెలిపారు. దీనితో పాటుగా ఎల్ఓసి ద్వారా ముందస్తుగా కావాలసిన ఆపరేషన్ ఖర్చులను కూడా బాధిత రోగులకు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ దఫా లో 78 మంది రోగుల ధరఖాస్తులను అందించడం జరిగిందన్నారు. ప్రజా సంక్షేమ ఫలాలు ప్రజలకు అందించడమే తన ప్రధాన లక్ష్యం గా ఆయన వివరించారు. కార్యక్రమంలో అశోక్ , వినోద్ తదితరులు ఉన్నారు..



## విద్యార్థుల్లో సోదరభావం పెంచాలి

**రాజేంద్రనగర్ మహా ;** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) శంషాబాద్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం రక్షా బంధన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, విద్యార్థినిలు రాఖీలు కట్టి రక్షా బంధన్ పండుగ విశిష్టతను తెలిపారు.ఈ కార్యక్రమానికి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శంషాబాద్ నగర సంపర్క్ ప్రముఖ్ కర్పూరపు తిరుపతిరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షా బంధన్ అనేది కేవలం అన్నాచెల్లెళ్ల మధ్య రాఖీ కట్టుకునే పండుగ మాత్రమే కాదని, సమాజంలో పరస్పర రక్షణ, సోదరభావం, ఐక్యతను పెంపొందించే గొప్ప సంస్కారమన్నారు. నీవు నాకు రక్ష నేను నీకు రక్ష మనమంతా మన దేశానికి రక్ష అనే భావన ప్రతి విద్యార్థిలో ఉండాలన్నారు. విద్యార్థులు కుల, మత, ప్రాంత భేదాలకు అతీతంగా ఐక్యంగా ఉండి, సమాజం, దేశం పట్ల బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. దేశభద్రత, సమాజ శ్రేయస్సు ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యార్థి దశ నుంచే సేవాభావం, దేశభక్తి, క్రమశిక్షణ వంటి విలువలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి బత్తుల భరత్, ఉపాధ్యక్షులు క్రిష్, సంయుక్త కార్యదర్శులు తరుణ్,వెంకటేష్,రోహిత్, మహిళా కన్వీనర్ హరిప్రియ,శ్రీకాంత్,శివ,కృష్ణ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





## రోడ్డు ప్రమాదాల నివారణకు సూచిక ఏర్పాటు!

- **గురునానకు వద్ద రోడ్డు రద్దీగా మారడంతో తరచూ ప్రమాదాలు**
- **వాటికి అనుగుణంగానే సూచిక స్టిక్స్ ఏర్పాటు**
- **ఇబ్రహీంపట్నం ఏసిపి కేపివి రాజు**

**ఇబ్రహీంపట్నం ఆగస్టు 27 మహా:** ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోని గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద సాగర్ హైవేపై రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు, రోడ్డు మధ్యలో సూచిక స్టిక్స్ ఏర్పాటు చేయడం జరిగింది. తరచూ ప్రమాదాలు జరుగుతున్న క్రమంలో ఇబ్రహీంపట్నం ఏసిపి కేపీవి రాజు సమక్షంలో, ట్రాఫిక్ సిఐ జితేందర్ రెడ్డి, ఆర్ అండ్ బి ఆధ్వర్యంలో ఈ యొక్క సూచిక స్టిక్స్ ను ఏర్పాటు చేయడం జరిగింది. గురునానక్ కాలేజీ ముందు వాహనాల రద్దీతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రజలు విద్యార్థులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వాటిని నివారించేందుకు పోలీసు, ఆర్ అండ్ బి వారి ఆధ్వర్యంలో ఈ యొక్క సూచిక స్టిక్కులను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఏసిపి రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్ రెడ్డి, యాచారం సీఐ నందీశ్వర్ రెడ్డి, ఎస్ఐలు, ఆర్ అండ్ బి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఎర్రవాగు ప్రాజెక్ట్ కు సీతారామ కాలువ నీళ్లు

**ఫోటోలకే పరిమితమైన కాంగ్రెస్ ప్రచారం**
**జనసేన మండల అధ్యక్షుడు రమేష్**



**జూలూరుపాడు, మహా:** సీతారామ ప్రాజెక్ట్, రాజీవ్ కెనాల్ ద్వారా విడుదల చేసిన నీళ్లు కాకర్ల ఎర్రవాగు ప్రాజెక్ట్ చెరువులో కనీసం నాలుగు అడుగుల కూడా చేరలేదని, ఫోటోలతో ప్రజలను కాంగ్రెస్ నాయకులు మభ్యపెడుతున్నారని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు ఉసికల రమేష్ విమర్శించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సీతారామ ప్రాజెక్ట్ నీటిని దారి మళ్లించి పక్క జిల్లాలకు తరలిస్తున్నారని ఆరోపించారు. నీటిని మా భూముల గుండా తీసుకు వెళుతూ మాకు నీళ్లు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నారని, మండల రైతులు, రైతు సంఘాల నాయకులు నెత్తినోరు కొట్టుకున్న పట్టించుకునే నాధుడే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు ఎర్రవాగు కు నీళ్లు అందిస్తున్నామని చేస్తున్న ప్రచారం కేవలం ఫోటోలు, ఆర్భాటానికే పరిమితమైందని రమేష్ విమర్శించారు. దీర్ఘకాలిక ప్రయోజనం కోసం కాలువలు, స్వెటర్లు, లాక్ ల ద్వారా చెరువులకు నిరంధించకుండా, సిమెంటు పైపు, ప్లాస్టిక్ సెక్షన్ పైప్ ద్వారా చెరువులకు నీళ్లు అందించడం ఏంటని ప్రశ్నించారు. సుమారు 250 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఎర్రవాగు చెరువులో ఇప్పటికీ కనీసం నాలుగు అడుగుల నీరు కూడా చేరకపోవడం కాంగ్రెస్ నాయకుల అసమర్ధతకు నిదర్శనం అన్నారు. కాకర్ల ఎర్రవాగు చెరువు కు రెండు తూములు, ఎనిమిది పిల్లకాలువల ద్వారా సుమారు 1200 వందల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందాల్సి ఉందని అన్నారు. ఇప్పటికీ చెరువుకు పూర్తి స్థాయిలో నీరు చేరకపోవడంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులకు రైతుల మీద నిజంగా ప్రేమ ఉంటే తూతూ మంత్రం పనులను పక్కన పెట్టి, శాశ్వత కాలువల ద్వారా మండలంలోని చెరువులను నింపి మండలాన్ని సస్యశ్యామలం చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. లేకపోతే మండల ప్రజలు కాంగ్రెస్ నాయకులకు "బిల్డప్ ఎక్కువ బిజినెస్ తక్కువ" అనుకునే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని రమేష్ జోష్యం చెప్పారు.

# 2007లో ఇచ్చిన 60 గజాల పట్టాలకు స్థలాలు చూపించే వరకు అండగా ఉంటా

**టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు**
**కల్వకుంట్ల కవిత**



**మొయినాబాద్ మహా:** మొయినాబాద్ మున్సిపాలిటీ హిమాయత్ నగర్ సర్వే నంబర్ 151లో 2007లో మంజూరైన 60 గజాల పట్టాలకు స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ గత 63 రోజులుగా నిరంతర ధర్నా చేస్తున్న బాధితులు గురువారం తెలంగాణ రక్షణ సేన చిప్ కల్వకుంట్ల కవితను పార్టీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. బుధవారం బాధితుల దీక్షా శిబిరాన్ని సందర్శించి వారి సమస్యలను తెలుసుకున్న కల్వకుంట్ల కవిత, పార్టీ కార్యాలయానికి ఆహ్వానించి మరోసారి వారి వినతిని స్వీకరించారు. బాధితులు 2007లో తమకు ఇచ్చిన పట్టాలకు ఇప్పటివరకు స్థలాలు చూపించలేదని, వెంటనే ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ, 2007లో ఇచ్చిన 60 గజాల పట్టాలకు స్థలాలు చూపించే వరకు మీ పోరాటానికి నేను అండగా ఉంటాను అని హామీ ఇచ్చారు. బాధితులకు స్థలాలు కేటాయించే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి, ఈ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని మాట ఇచ్చారు. కవిత ఇచ్చిన హామీతో బాధితులు ఆనందం వ్యక్తం చేస్తూ, తమకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ ఎస్ పార్టీ చేవేళ్ల నియోజకవర్గం ఇంచార్జి బేగరి రాజు, టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కుమ్మరి శివ శంకర్, టిఆర్ఎస్ పార్టీ మొయినాబాద్ మున్సిపాలిటీ అధ్యక్షుడు యండి అన్వార్ ఖాన్,టిఆర్ఎస్ పార్టీ మొయినాబాద్ మండల యూత్ అధ్యక్షులు కుమ్మరి పవన్, భార్గవ్ రెడ్డి, 60 గజాల బాధితులు, మహిళలు, ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.



# గ్రంథాలయాలు.. జ్ఞాన నిలయాలు

**ఆదిలాబాద్ మహా:** సమాజంలో గ్రంథాలయాలు ఎంతో ఉపయుక్తమని మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష అన్నారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని మున్నూరు కాపు సంఘ భవనంలో ఏర్పాటు చేసిన లైబ్రరీ రీడింగ్ రూంలను మాజీ మంత్రి జోగు రామన్న తో కలిసి ఆమె రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.పుస్తక పఠనం వలన జ్ఞానంతో పాటు వ్యక్తిత్వం కూడా అలవడుతుందన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న పేద విద్యార్థులకు గ్రంథాలయం ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుపేద యువత కోసం లైబ్రరీని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత లైబ్రరీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు తోట శివన్న, కార్యదర్శి సంతోష్, రఘుపతి, బండారి సతీష్, దేవన్న మున్నూరు కాపు కులస్తులు పాల్గొన్నారు.



# చీకటి గూడేలకు సోలార్ వెలుగులు

- **50 గిరిజన కుటుంబాలకు ఇడుపుల రాజు చేయూత**
- **రెండు లక్షల విలువైన సోలార్ లైట్లు, బ్యాటరీల పంపిణీ**

**జూలూరుపాడు, మహా:** విద్యుత్ సౌకర్యం లేక చీకట్లో మగ్గుతున్న గిరిజన కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఇడుపుల రాజు ముందుకు వచ్చారు. ములకలపల్లి మండలంలోని పాత గుండాలపాడు పంచాయతీ పరిధిలోని పాలవాగు, ఓర్రెగుంపు తదితర గిరిజన గూడేల్లో నివసిస్తున్న సుమారు 50 గుత్తికోయ కుటుంబాలకు రూ.2 లక్షల విలువైన సోలార్ లైట్లు, బ్యాటరీలు, ఇతర సామగ్రిని బుధవారం పంపిణీ చేశారు. అడవుల్లో విషపురుగులు, కీటకాలు, క్రూరమృగాల సంచారం మధ్య జీవిస్తున్న గిరిజన కుటుంబాలకు రాత్రివేళల్లో వెలుతురు ఎంతో అవసరమని గుర్తించి ఈ సహాయం అందించినట్లు ఇడుపుల రాజు తెలిపారు. సమాజానికి దూరంగా, సహజ వనరులపై ఆధారపడి జీవిస్తున్న గుత్తికోయ కుటుంబాలకు అండగా నిలవడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. “చీకట్లో ఉన్న వారి జీవితాల్లో చిన్న వెలుగైనా నింపడం మన మానవతా బాధ్యత” అని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా గిరిజన కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. మానవతా దృక్పథంతో సహాయం చేసేందుకు ముందుకు వచ్చే వారు తనను సంప్రదిస్తే, మరింత మెరుగైన సహాయాన్ని అందించేందుకు కలిసి పనిచేస్తానని తెలిపారు.



# భూగర్భ జలాలను పెంపొందించాలి

- **గ్రామ సభకు హాజరైన కలెక్టర్**
- **పలు విషయాలపై ప్రజలకు అవగాహన**

**ఆదిలాబాద్ మహా:** భూగర్భ జలాలను పెంపొందించడం ద్వారా రైతులకు రెండో పంట సాగు అవకాశాలు మెరుగుపడతాయని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం నార్నూర్ మండలం గుంజాల గ్రామంలో నిర్వహించిన వాటర్ షెడ్ ప్రారంభోత్సవ కార్యక్రమం, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పై గ్రామసభ, అభివృద్ధి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు.మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని న్యూట్రిగార్డెన్ నిర్వహణను పరిశీలించారు. వన మహోత్సవంలో భాగంగా స్వయంగా మొక్కనాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో ముసాయిదా ఓటరు జాబితా, ఏఎస్డీ జాబితాలను బిఎల్ఓ లక్ష్మీ చదివి వినిపించారు.
గుంజాల గ్రామం నుండి ప్రారంభమైన ఈ వాటర్ షెడ్ ప్రాజెక్ట్ భవిష్యత్తులో మండలంలోని మిగతా 11 గ్రామాలకు దశలవారీగా విస్తరించబడుతుందని కలెక్టర్ తెలిపారు. భూగర్భ జలాలను పెంపొందించడం, వర్షపు నీటిని సంరక్షించడం ద్వారా రైతులు రెండు పంటలు వేసుకోవడానికి ఇది ఎంతగానో దోహదపడుతుందని, కేరళ తరహాలో నాబార్డ్ సహకారంతో జియో ట్యాగింగ్ పద్ధతుల్లో పారదర్శకతతో ఈ పనులు చేపట్టడం జరుగుతోందని స్పష్టం చేశారు. అలాగే రైతుల విద్యుత్ సౌకర్యం కొరకు 1 కిలోమీటర్ పరిధిలో 20 పోల్స్ వరకు ఎలాంటి అదనపు డెవలప్మెంట్ చార్జీలు లేకుండా కేవలం రూ.9,150/ చెల్లిస్తే విద్యుత్ శాఖ ద్వారా ఉచితంగా పోల్స్, లైన్లు వేయబడతాయని తెలిపారు. చివరి ఇళ్లకు సైతం తక్కువ ఖర్చుతో విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయించుకోవచ్చని వెల్లడించారు. హస్తాపూర్ నార్నూర్ రహదారి పనులతో పాటు పెండింగ్‌లో ఉన్న రోడ్లకు త్వరలో నిధులు మంజూరు చేయడం, గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో సిఆర్టి ఉపాధ్యాయుల కొరతను తీర్చడం, పాత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయడం, వృద్ధులు, దివ్యాంగుల పింఛన్ల మంజూరుపై ప్రత్యేక దృష్టి సారిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నాబార్డ్ డిడిఎం అబ్దుల్ రౌఫ్, ధాన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు నీలేష్, పంచాయతీ రాజ్ ఈఈ శివరాం, ఎంపీడీవో పుల్లరావు, ఏంఆర్ఓ రాజలింగు, ఏంఈఓ మనోహర్, డిఎల్పిఓ ప్రభాకర్, సర్పంచ్ జ్ఞానేశ్వర్, పాఠశాల ఉపాధ్యాయులు రామారావు, పంచాయతీ కార్యదర్శి రాధిక, బిఎల్ఓ లక్ష్మీ, గ్రామస్తులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పోలీస్ మీకోసం



**ఆదిలాబాద్ మహా:** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడం, నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా పోలీసులు మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం ఇచ్చోడ మండలం దాబా బి గ్రామంలో జిల్లా ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు.గ్రామాల్లో ప్రజల భద్రత, ఆరోగ్యం, విద్య, యువత భవిష్యత్తు కోసం పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తోందన్నారు. గ్రామస్తులు తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.గంజాయి, గుడుంబా, ఇతర మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రజల సహకారం ఎంతో అవసరమని అన్నారు. గ్రామంలో ఎవరైనా గంజాయి సాగు చేస్తున్నా, విక్రయిస్తున్నా లేదా మాదకద్రవ్యాల వినియోగానికి పాల్పడుతున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గంజాయికి దూరంగా ఉండాలని యువతకు సూచించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులు, యువతలో అవగాహన పెంచాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు గంజాయి పండించిన రైతుల కు ప్రభుత్వ పథకాలు వర్తించకుండా సిఫార్సు చేయడం జరిగిందని తెలిపారు.అలాగే సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యతను వివరించిన ఎస్పీ, గ్రామాల్లో సీసీటీవీల ఏర్పాటుతో నేరాల నియంత్రణతో పాటు నేరస్తులను గుర్తించడం సులభమవుతుందని అన్నారు. గ్రామ భద్రతలో సీసీటీవీలు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రజలు వీటి ఏర్పాటుకు ముందుకు రావాలని సూచించారు. హెల్మెట్ వినియోగంతో రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం గణనీయంగా తగ్గుతుందని, హెల్మెట్ ధరించేలా కుటుంబ సభ్యులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు 10 హెల్మెట్లను పంపిణీ చేశారు. విద్యార్థులు రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై ఆకట్టుకునే విధంగా స్కిట్స్ ప్రదర్శించారు. రోడ్డు భద్రత, డ్రగ్స్‌కు దూరంగా ఉండటం వంటి అంశాలపై సందేశాన్ని అందించారు. ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని, జొన్నలు వంటి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ఆహారంలో భాగంగా చేసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. అలాగే నకిలీ బాబాలు, మోసగాళ్ల మాటలను నమ్మి ప్రజలు డబ్బులు కోల్పోవద్దని, అనుమానాస్పద వ్యక్తులు లేదా మోసపూరిత కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు.అనంతరం పాఠశాల విద్యార్థులు జిల్లా ఎస్పీకి రాఖీని కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పి రుత్వీక్ సాయి కొట్టే ఐపీఎస్, ఇచ్చోడా సీఐ కె నరేష్ కుమార్, గ్రామ సర్పంచ్ ఈశ్వర్, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, ఆదిలాబాద్ ప్రైవేట్ వైద్యులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు, మహిళలు, యువత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# తరగతి అదనపు గదుల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మహా :** కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలలో చేపట్టిన అభివృద్ధి పనులు,తరగతి గదుల నిర్మాణాలనుత్వరగా పూర్తి చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మందమర్రి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అక్కడ కొనసాగుతున్న అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యార్థులకు సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం శరవేగంగా చర్యలు చేపడుతుందని అన్నారు.ఈ క్రమంలో అదనపు గదుల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆయన కోరారు. విద్యాలయంలోని వంటశాల, భోజనశాలలను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, పరిశుభ్రత, వంటశాలలో పాటిస్తున్న పారిశుద్ధ్య ప్రమాణాలను పరిశీలించారు. విద్యాలయంలో విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి విద్యాలయంలో అందుతున్న విద్యా బోధన, వసతులు, మధ్యాహ్న భోజన నాణ్యత, త్రాగునీరు, పారిశుద్ధ్యం, ఇతర సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాఖీ పౌర్ణమికి ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు.

**హైదరాబాద్, మహా.** రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 5,000 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆగస్టు 27 నుంచి 31వ తేదీ వరకు ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఈ ప్రత్యేక బస్సులు అందుబాటులో ంటాయని వెల్లడించారు.రాఖీ పండుగ సందర్భంగా హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పట్టణాల నుంచి సొంతూళ్లకు వెళ్లే వారి సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా పండుగకు ముందు రోజులు, పౌర్ణమి రోజున ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ముందుగానే అదనపు బస్సులను సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు.హైదరాబాద్ నుంచి ఉమ్మడి జిల్లాల పరిధిలోని పలు ప్రాంతాలకు, అలాగే పొరుగు రాష్ట్రాల్లోని ముఖ్యమైన గమ్యస్థానాలకు ప్రయాణికుల అవసరాన్ని బట్టి ప్రత్యేక బస్సులను నడపనున్నారు. రద్దీ ఎక్కువగా ఉన్న మార్గాల్లో సాధారణ సర్వీసులకు అదనంగా ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు.పండుగ సమయంలో ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా బస్టాండ్ల వద్ద అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయడంతో పాటు రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రయాణికుల భద్రత, సమయపాలన, బస్సుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించినట్లు మంత్రి తెలిపారు.రాఖీ పౌర్ణమి సందర్భంగా సోదర, సోదరీమణులు పెద్ద సంఖ్యలో స్వగ్రామాలకు, బంధువుల ఇళ్లకు ప్రయాణించే అవకాశం ఉండటంతో ప్రధాన రహదారులు, బస్టాండ్ల వద్ద రద్దీ పెరగనుంది

# ఉద్యోగుల గళం.. ప్రభుత్వం వినాల్సిందే

**న్యాయమైన డిమాండ్లను తక్షణమే**
**పరిష్కరించాలి: దారం శ్రీనివాస్ రెడ్డి**



**కరీంనగర్, మహా :** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట భారీ మహాధర్నా నిర్వహించారు. జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో ధర్నా చౌక్ కిక్కిరిసిపోయింది.
పీఆర్సీ అమలు, పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరణ, ఉద్యోగులు-పెన్షనర్ల పెండింగ్ బిల్లుల చెల్లింపు, ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను సమర్థవంతంగా అమలు చేయడం తదితర డిమాండ్లతో ఉద్యోగులు నినాదాలు చేశారు. తమ సమస్యల పరిష్కారంలో జాప్యం చేయడం వల్ల ఉద్యోగ వర్గాల్లో ఆందోళన పెరుగుతోందని నాయకులు పేర్కొన్నారు.

**ఇది నిరసన కాదు.. ఉద్యోగుల ఆవేదన**

మహాధర్నాలో ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమిస్తున్నామని తెలిపారు.
“ప్రభుత్వాన్ని ఉద్యోగులు గొంతెమ్మ కోరికలు కోరడం లేదు. ఉచితాలు, దానధర్మాలు అడగడం లేదు. రాజ్యాంగబద్ధంగా, న్యాయబద్ధంగా తమకు రావాల్సిన హక్కులనే కోరుతున్నారు. ఉద్యోగుల ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకుని తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టాలి” అని అన్నారు. ప్రతి ఆరు నెలలకు డీఏ, ప్రతి ఏడాది ఇంక్రిమెంట్, నిర్ణీత కాలానికి పీఆర్సీ వంటి అంశాలు ఉద్యోగుల ఆర్థిక భద్రతతో ముడిపడి ఉన్నాయని తెలిపారు. దీర్ఘకాలంగా సమస్యలు పరిష్కారం కాకపోవడం ఉద్యోగులు, పెన్షనర్లపై ఆర్థిక భారాన్ని పెంచుతోందన్నారు.

**ఆరు డీఏలు వెంటనే విడుదల చేయాలి**

పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని దారం శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. నిత్యావసరాల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో ఉద్యోగులు, పెన్షనర్లకు రావాల్సిన డీఏలు సకాలంలో అందకపోవడం వల్ల కుటుంబాలపై ఆర్థిక భారం పడుతోందన్నారు. అలాగే రెండో పీఆర్సీని తక్షణమే అమలు చేసి 01072023 నుంచి వర్తింపజేయాలని కోరారు. ఉద్యోగులు, పదవీ విరమణ చేసిన సిబ్బందికి సంబంధించిన పెండింగ్ బిల్లులు, బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు ప్రతి నెల పెండింగ్ బిల్లుల చెల్లింపులకు అవసరమైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

**సీపీఎస్ రద్దు.. ఓపీఎస్ పునరుద్ధరణ**

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.
ఈ సందర్భంగా దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ “పెన్షన్ భిక్ష కాదు.. ఉద్యోగి హక్కు. జీవితకాలం ప్రభుత్వానికి సేవ చేసిన ఉద్యోగికి వృద్ధాప్యంలో ఆర్థిక భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత” అని అన్నారు. సీపీఎస్‌లో ఉన్న భద్రత, భరోసా లేని పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు.

**కాగితాలపై కాదు.. చేతల్లో ఈహెచ్ఎస్**

ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (EHS)లో ఉన్న లోపాలను సవరించి ఉద్యోగులు, పెన్షనర్లకు పూర్తిస్థాయిలో నగదు రహిత వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. “హెల్త్ కార్డు ఉందని చెప్పుకోవడం కాదు.. అవసరమైన సమయంలో ఆసుపత్రిలో వైద్యం అందాలి. ఉద్యోగి లేదా పెన్షనర్ అనారోగ్యానికి గురైనప్పుడు వైద్యం కోసం డబ్బు ఎక్కడి నుంచి తేవాలనే ఆందోళన ఉండకూడదు” అని దారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

**ప్రభుత్వానికి ఉద్యోగులే వెన్నెముక**

ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేసేది ప్రభుత్వ ఉద్యోగులేనని ఆయన అన్నారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి అమలు చేసేది ఉద్యోగులేనని, ప్రభుత్వ పాలనకు ఉద్యోగులే వెన్నెముక అని పేర్కొన్నారు. “ప్రభుత్వం ఒక పథకం ప్రకటిస్తే దాన్ని ప్రజల గడప వద్దకు తీసుకెళ్లేది ఉద్యోగి. పాలనను ప్రజలకు చేరువ చేసేది ఉద్యోగి. అలాంటి ఉద్యోగుల సంక్షేమాన్ని కూడా ప్రభుత్వం అదే స్థాయిలో పట్టించుకోవాలి” అని అన్నారు.

**సహనాన్ని బలహీనతగా భావించొద్దు**

ఉద్యోగుల ఉద్యమ చరిత్రను గుర్తు చేస్తూ దారం శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వానికి స్పష్టమైన సందేశం ఇచ్చారు. “ఉద్యోగులకు ఉద్యమాలు కొత్త కాదు.. పోరాటాలు కొత్త కాదు. మా సహనాన్ని పరీక్షించవద్దు. మా సహనాన్ని చేతగానితనంగా భావించవద్దు. మేము ఘర్షణ కోరుకోవడం లేదు.. పరిష్కారం కోరుకుంటున్నాం. మేము పోరాటం కోరుకోవడం లేదు.. న్యాయం కోరుతున్నాం” అని అన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తే ఉద్యోగులు మరింత అంకితభావంతో విధులు నిర్వర్తిస్తారని, నిర్లక్ష్యం కొనసాగితే హక్కుల సాధన కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

**ఐక్యంగా కదిలిన ఉద్యోగ వర్గాలు**

ఎంప్లాయీస్ జేఏసీ సెక్రెటరీ జనరల్, జేఏసీ కన్వీనర్ మడిపల్లి కాళీ చరణ్ గౌడ్ కార్యనిర్వహణలో జరిగిన మహాధర్నాలో వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. గెజిటెడ్ అధికారులు, నాలుగో తరగతి ఉద్యోగులు, డ్రైవర్లు, పంచాయతీ రాజ్, రెవెన్యూ, సబ్ ఆర్డినేట్ శాఖల ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై ఐక్యతను చాటారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పీఆర్సీ అమలు, డీఏల విడుదల, సీపీఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణ, ఈహెచ్ఎస్‌లో లోపాల సవరణ, పెండింగ్ బిల్లులు, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపు తదితర సమస్యలపై ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని కోరారు. “కరీంనగర్ ధర్నా చౌక్ నుంచి వినిపించిన ఉద్యోగుల గళం ప్రభుత్వానికి చేరాలి. ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం లభించాలి. ఉద్యోగుల కుటుంబాల్లో ఆర్థిక భరోసా, ముఖాల్లో చిరునవ్వు రావాలి. అదే మా మహాధర్నా లక్ష్యం” అని దారం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, ఎడ్ల అరవింద్ రెడ్డి, పెన్షనర్ల సంఘం అధ్యక్షులు కేశవరెడ్డి, ఉస్మాన్ పాషా, ఈశ్వరయ్య, అశోక్ రావు, ఎం.డి. సలీం, కరుణాకర్ రెడ్డి, ఎలదాసరి లింగయ్య, రామస్వామి, శంకర్, ముప్పిడి కిరణ్ కుమార్ రెడ్డి, రవీందర్ రెడ్డి, రాగి శ్రీనివాస్, సర్దార్ హర్మీందర్ సింగ్, రాజేష్ భరద్వాజ్, సుమంత్ రావు, శారద, వరీస్ నవాబు, సతీష్, జనార్ధన్, చంద్రమౌళి, ప్రభాకర్ రావు, కె. రాజు, నరసింహారెడ్డి, లక్ష్మణరావు, సునీత, సరిత, కరుణ, విజయలక్ష్మి, సుస్మిత, ప్రవీణ్ రావు, రాజిరెడ్డి, శ్రీనివాస్, విజయ్, తిరుపతి రెడ్డి, నరసయ్య, సత్యనారాయణ రెడ్డి, ప్రేమ్ సాగర్, వెంకట రాజిరెడ్డి, అభినవ్ రెడ్డి, ఎం.డి. అబ్దుల్, ఎం.డి. యూసుఫ్, రామ్మోహన్ రావు, పోలుకిషన్, రమేష్ గౌడ్, ప్రసాద్ రెడ్డి, నరేష్ పటేల్, సత్యనారాయణ, రోహిత్, గుండ రాజేష్, కమలాకర్, కరుణాకర్, అజ్గార్ అలీ, లవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# సీసీ కెమెరాలు.. రక్షణ కవచాలు

**ఆదిలాబాద్ మహా** : ఒక్క సీసీ కెమెరా వందమంది సిబ్బందితో సమానమని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. గురువారం ఇచ్చోడ మండలం మాదాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన 21 సీసీటీవీ కెమెరాలను ఆయన ప్రారంభించారు. గ్రామానికి చేరుకున్న జిల్లా ఎస్పీకి గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు.మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలు శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నియంత్రణకు ఎంతగానో ఉపయోగ పడతాయని తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.యువత గంజాయికి దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గ్రామంలో అన్ని మతాల ప్రజలు పరస్పరం సోదరభావంతో, ఐకమత్యంగా ఉంటూ శాంతియుత వాతావరణాన్ని కొనసాగించాలని కోరారు.కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, ఇచ్చోడ ఎస్‌హెచ్ఓ కె. నరేష్ కుమార్, గ్రామ సర్పంచ్ షేక్ ఇమ్రాన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు షేక్ షాదుల్లా గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




# కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలి

- **యువజన కాంగ్రెస్ మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షులు అరుణ్ వాల్మీకి డిమాండ్**

**బెల్లంపల్లి, మహా**: కేంద్రహోంశాఖ మంత్రి అమీత్ షా ను మంత్రివర్గం నుండి భారత రఫ్ చేయాలని మంచిర్యాల యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అరుణ్ వాల్మీకి డిమాండ్ చేశారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి, బెల్లంపల్లి నియోజకవర్గ శాసన సభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాల మేరకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా దిష్టి బొమ్మ దగ్ధం చేసినట్లు తెలిపారు.బెల్లంపల్లి పట్టణ కేంద్రంలో నిరసన కార్యక్రమంను యూత్ కాంగ్రెస్ నాయకులు నిర్వహించిన అనంతరం అరుణ్ వాల్మీకి మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీపై శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులపై పెల్లెట్ గన్లతో కాల్పులు జరపడం దుర్మార్గమైన చర్య అని,కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ బాధితులతో కలిసి స్వయంగా పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినప్పటికీ పోలీస్ యంత్రాంగం స్పందించకపోవడం బాధాకరమన్నారు.కాల్పుల ఘటనపై తక్షణమే ప్రధాని మోడీ స్పందించి సంబధితశాఖమంత్రి అమిత్ షాను మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మరిన్ని ఉద్యమాలు,పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి భరత్ , బెల్లంపల్లి నియోజకవర్గ ఉపాధ్యక్షులు పోచంపల్లి హరీష్, ప్రధాన కార్యదర్శి మంతెన శివ, అభిలాష్, బెల్లంపల్లి మండల్ అధ్యక్షులు రాకేష్, తాండూర్ మండల అధ్యక్షుడు విష్ణు కళ్యాణ్, బెల్లంపల్లి పట్టణ ఉపాధ్యక్షులు ఇమ్రోజ్,పట్టణ కార్యదర్శి సాయి, యూత్ కాంగ్రెస్ నాయకులు రామిల ప్రదీప్ , అరుణ్, ఎజాస్ పాషా , రవి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలి

- **జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు**



**మంచిర్యాల, మహా** : జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు అన్నారు. గురువారం హాజీపూర్ మండలం కర్ణమామిడి, లక్షెట్టిపేట మండలం చందారం గ్రామపంచాయతీ కార్యాలయాలలో ఎస్ఐఆర్ పై నిర్వహించిన గ్రామసభలలో ఆయా మండలాల తహసిల్దార్లు, అధికారులతో కలిసి గ్రామ సభలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా రూపొందించిన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచి, అందులో గుర్తించిన అనామలీస్ ఓటర్ల వివరాలను గ్రామసభలో చదివి వినిపించాలని బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. ఎ.ఎస్.డి. ఓటర్లకు సంబంధించి నోటీసులను నిబంధనల ప్రకారం జారీ చేసి, తదుపరి ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రతి దశను పారదర్శకంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని బూత్ స్థాయి అధికారులు, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అసలైన లబ్ధిదారులకే డబుల్ బెడ్ రూమ్ లు ఇవ్వాలి

**--మందమర్రి తాసిల్దార్ కార్యాలయం ముందర భారత రాష్ట్ర సమితి ఆందోళన**



మందమర్రి, మహా : అసలైన లబ్ధిదారులకే డబుల్ బెడ్ రూమ్ లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం మందమర్రి తాసిల్దార్ కార్యాలయం ముందర భారత రాష్ట్ర సమితి ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా నాయకులు బండారు సూరిబాబు, ఎండి అబ్బాస్, బత్తుల శ్రీనివాస్, మాజీ పట్టణ అధ్యక్షులు రాజనర్సు కనకం రవీందర్ లు మాట్లాడుతూ పట్టణంలో సొంతగృహం లేని వారు చాలామంది ఉన్నారని అన్నారు. అయితే డబుల్ బెడ్ రూమ్ మంజూరులో అసలైన అర్హులను గుర్తించకుండా నకిలీలను ఎంపిక చేసి వారు తాసిల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు. మరోసారి ఎంపికదారులపై విచారణ జరిపి అనర్హులను జాబితా నుండి తప్పించి కేవలం అర్హులకు మాత్రమే గృహాలకు మంజూరు జాబితాలో చేర్చాలని వారు కోరారు. అంతకు క్రితం కార్యాలయం ముందర అధికార పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తాసిల్దార్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోడం శ్రీనివాస్, పల్లె నర్సింగ్, ఎస్టిడి ఓదెలు, మొగరం శ్రీనివాస్ రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ ప్రవేశ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన డీసీపీ

- **అభ్యర్థులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకునే అవకాశం!**
- **అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి..**
- **మహేశ్వరం డిసిపి నారాయణరెడ్డి**



**ఇబ్రహీంపట్నం ఆగస్టు 27 మహా:** అభ్యర్థులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకునే అవకాశాన్ని, ఉజ్వల భవిష్యత్తుగా మార్చుకోవాలని మహేశ్వరం డిసిపి నారాయణరెడ్డి అన్నారు. పరీక్షా కేంద్రంలో ఈనెల 30న జరగనున్న నీట్ ప్రవేశ పరీక్ష ఏర్పాట్లను ఏసీపి రాజు, ఎమ్మార్వో సునీతలతో కలిసి ఆయన పరిశీలించాను. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధి శేరిగూడలోని టిసిఎస్ అయాన్ డిజిటల్ పరీక్ష కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, అభ్యర్థులకు కావాల్సిన సదుపాయాలను కల్పించే విధంగా ఏర్పాట్లు చేయడం జరుగుతుందని డిసిపి అన్నారు. విద్యార్థులు పరీక్ష సమయానికి గంట ముందు హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకునే అవకాశం ఈ యొక్క పరీక్షతో వచ్చిందని, ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిసిపి తెలిపారు. మాస్ కాపింగుకు పాల్పడి ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, మాస్ కాపింగుకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మహేశ్వరం డిసిపి నారాయణరెడ్డి, హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐలు మహేందర్ రెడ్డి, సత్యనారాయణ, ట్రాఫిక్ సిఐ జితేందర్ రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు

వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్, బ్యూరో మహా ;

వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జిల్లా ప్రజలందరికీ రాఖీ పౌర్ణమి (రక్షా బంధన్) పండుగ శుభాకాంక్షలు ఓ ప్రకటనలో తెలిపారు.
ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ
అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముడి అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పౌర్ణమి పండుగను జిల్లా ప్రజలందరూ ఆనందోత్సాహాలతోజరుపుకోవాలని సోదరీమణుల రక్షణకు అన్నదమ్ములు అండగా నిలవాలని ఆకాంక్షించారు. మహిళలను గౌరవించడం, వారి సంక్షేమానికి కృషి చేయడం మనందరి బాధ్యత అని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత కోసం అనేక పథకాలు అమలు చేస్తోందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ మరోసారి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

# ఇళ్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం ఆప్రజాస్వామికమైన చర్య

- **ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి.**
- **విద్యుత్ రంగాన్ని ఆదాని చేతిలో పెట్టడం సహించం**



**కుషాయిగూడ, మహా:** స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇళ్లకు విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయడం. సెల్ ఫోన్లు రీఛార్జి మాదిరిగానే విద్యుత్ మీటర్లు పెట్టడంపై అసహనం వ్యక్తం చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపుదలపై గతంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు వచ్చాయని గుర్తు చేశారు. మన కరెంట్ ను అదానీ చేతుల్లో పెట్టొద్దు.ప్రభుత్వ పరిధిలోనే మన కరెంటు ఉండాలన్నారు. రాష్ట్రంలో గృహ విద్యుత్ కనెక్షన్లకు ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ప్రతిఘటిస్తామన్నారు. సెల్ ఫోన్లు రీ ఛార్జ్ చేసుకున్నట్టు కరెంట్ మీటర్లు రీ ఛార్జ్ చేసుకుంటేనే కరెంట్ సరఫరా చేస్తామనడం ఆ ప్రజాస్వామికమైన చర్యగా అభివర్ణించారు. ఉచిత కరెంట్ ను ఎత్తివేసేందుకే స్మార్ట్ మీటర్లు తెరపైకి చేస్తున్నారని విమర్శించారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలన్నారు. ఏకపక్ష నిర్ణయాలతో కరెంటు మీటర్లను ఏర్పాటు చేస్తే ప్రజా గ్రహానికి గురి కావలసి వస్తుందని హెచ్చరించారు.

# మట్టి గణపతి నే పూజించండి

**విజయమారుతీశర్మ**

**దమ్మపేట ,మహా :** హైందవులు అత్యంత భక్తి శ్రద్దలతో జరుపుకునే వినాయక చవితి పండుగ వేడుకలను పర్యావరణానికి హాని కలగకుండా జరుపుకోవాలని , అందుకోసం మట్టితో చేసిన గణపతి విగ్రహాలనే పూజించాలని అంతర్జాతీయ అవార్డు గ్రహీత ,దైవ పీఠాధిపతులైన కామవరపు విజయమారుతీ శర్మ పిలుపునిచ్చారు. గత కొన్నేళ్లుగా ఈ భూమి పై తెలిసీ తెలియక చేసిన ప్లాస్టర్ ఆఫ్ పారీస్ విగ్రహాలను హైందవ భక్తులు వేడుకలలో ప్రదర్శన చేయడం ,మరలా వాటిని వేడుక చివరి రోజుల్లో నిమర్జనం పేరుతో నీటిలో కలపడం జరుగుతుంది అన్నారు. అట్టి సమయంలో ప్లాస్టర్ ఆఫ్ పారీస్ తో చేసిన విగ్రహాలు నీటిలో కరగక పర్యావరణానికి ముప్పు వాటిల్లే అవకాశం లేకపోలేదని తెలిపారు. సమస్త జీవకోటి ప్రాణులు చెరువులు ,గోదావరి జలాలు ఉపయోగిస్తున్న క్రమంలో కలుషిత పూరితమైన నీటిని వినియోగించడంతో అనేక సమస్యలకు ప్రత్యక్షంగా ,పరోక్షంగా కారణమవుతుందని ఆవేదన చెందారు. అందుకోసం మారుతున్న టెక్నాలజీ కి అనుగుణంగా ,యువత ఎందరినో ప్రభావితం చేస్తున్న ఈ ఆధునిక యుగంలోనైనా చేయి చేయి కలిపి మట్టి విగ్రహాలను వాడుకలోకి తీసుకువచ్చే ప్రయత్నం చేయాలని కోరారు. మట్టిగణపతిని పూజించడం వలన కలిగే మంచి ప్రభావాలను పలువురికి చేరవేయాలని కోరారు.



# ఇళ్ల స్థలాల సాధనకు జర్నలిస్టుల పాదయాత్ర

- **పాదయాత్రకు స్థానిక ఎమ్మెల్యే దంపతులతో పాటు పలు పార్టీ నేతల సంఘీభావం.**
- **త్వరలోనే జర్నలిస్టులకు తీపి కబురు: ఎమ్మెల్యే రాగమయి**

**సత్తుపల్లి, ఆగస్టు27: మహా :** జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో సత్తుపల్లి నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన జర్నలిస్టుల పాదయాత్రకు భారీ స్పందన లభించింది. పాదయాత్రతో నియోజకవర్గంలోని పాత్రికేయులు మండల తాసిల్దార్ కార్యాలయాలలో వినతి పత్రాలు అందజేశారు. పాదయాత్రతో అధికారులలో కనువిప్పు తెచ్చేందుకు జర్నలిస్టుల సంక్షేమం కోసం చిన్న వయసులోనే కంకణబద్ధుడై ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తున్న టిడబ్ల్యూజేఎఫ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఖదీర్‌ను పలువురు జర్నలిస్టులు అభినందించారు. ఇళ్ల స్థలాల సాధన కోసం చేపట్టిన పాదయాత్రలో నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరై నిరసన తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం చేపట్టిన పాదయాత్రకు లభించిన స్పందన ఉద్యమానికి మరింత బలాన్ని చేకూర్చిందని నిర్వాహకులు తెలిపారు. ఇళ్ల స్థలాల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు ఐక్యంగా పోరాటాన్ని కొనసాగిస్తామని జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సత్తుపల్లిలో నిర్వహిస్తున్న పాదయాత్రకు స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు దయానంద్ విజయకుమార్ తో పాటు పలు పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ.. సత్తుపల్లి జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇళ్ల స్థలాల సమస్య తన దృష్టిలో ఉందని తెలిపారు. సమస్య పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడుతున్నామని, సత్తుపల్లి జర్నలిస్టులకు త్వరలోనే తీపి కబురు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు, అధిక సంఖ్యలో పాత్రికేయులు పాల్గొన్నారు.

# 22ఏను రద్దు చేయాలి...!

- **రైతుల సమస్యలను పరిష్కరించాలి!**
- **రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూళ్ల వీరేందర్ గౌడ్**
- **రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముందు బిజెపి ధర్నా**
- **జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి మెమొరండం అందజేత**



**ఇబ్రహీంపట్నం ఆగస్టు 27 మహా:** రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి 22 ఏను రద్దు చేయాలని, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూల వీరేందర్ గౌడ్, జిల్లా బిజెపి అధ్యక్షుడు రాంభూపాల్ గౌడ్ డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయం వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్న బిజెపి జిల్లా నాయకులు కార్యకర్తలు 22ఏను రద్దు చేయాలని ధర్నా చేపట్టారు అనంతరం జిల్లా కలెక్టర్ ను కలిసి మెమొరాండం అందించారు. ఈ సందర్భంగా బిజెపి నేతలు మాట్లాడుతూ... గత ప్రభుత్వం తప్పిదాల వలన, భూ సమస్యలతో రైతులకు ఇబ్బందికరంగా మారిందని అన్నారు. పట్టా భూములను ప్రభుత్వ భూములుగా పరిగణిస్తూ 22ఏ జాబితాలో చేర్చడంతో చిన్న సన్నకారు రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు గురవుతున్నారని బిజెపి నేతలు మండిపడ్డారు. 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూములను తొలగిస్తామని మధ్య దళారులు, రైతుల వద్ద నుంచి లక్షల కొద్ది డబ్బులు దండుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మంత్రులే 22ఏ నిషేధిత జాబితా భూములు అనుమానాలు ఉన్నాయని అంటున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 22ఏ జాబితాను పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి కార్యదర్శి కొప్పు భాష, మాజీ ఎమ్మెల్యే కె ఎస్ రత్నం, నారాయణ, మల్లారెడ్డి, బిజెపి నాయకులు కార్యకర్తలు మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల హక్కుల కోసం పోరాటం చేస్తా

- **హక్కులు సాధించేవరకు పోరాటం ఆపేది లేదు**
- **సంగిశెట్టి క్రిస్టఫర్ తెలంగాణ మలిదశ ఉద్యమకాల సంఘం రాష్ట్ర అధ్యక్షులు**

**భువనగిరి ఆగస్టు 27 మహా న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటాలు చేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరే అంతవరకు పోరాటం ఆపేది లేదని హక్కులు సాధించే వరకు విశ్రమించేది లేదని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్ అన్నారు ఆయన గురువారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి ఎందుకు ఆలస్యం జరుగుతుందో చెప్పాలని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఉద్యమకారులను గుర్తించడానికి ప్రత్యేక వెబ్ సైట్
ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల గుర్తింపు కమిటీ మీద ఉద్యమకారులకు నమ్మకం ఏర్పడిందని ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా త్యాగాలను గుర్తించాలని ఇవాళ ఉద్యమకారులే త్యాగాలు చేయకపోతే మీరు ఇవ్వాలి ఎక్కడ ఉండేవారని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు అనేకమంది సహచర ఉద్యమకారులు చనిపోయారని మరికొంత మంది ఉద్యమకారుల పరిస్థితి అగమ్య గోచరంగా ఉందని ప్రభుత్వం వెంటనే న్యాయమైన డిమాండ్ నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు

# వరి సాగును తగ్గించి, రైతులను ఆరుతడి పంటల సాగువైపు ప్రోత్సహించాలి

- **వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**
- **జిల్లా వ్యవసాయ అభివృద్ధి పై అధికారులతో కలెక్టర్ సమీక్ష**




**వరంగల్, బ్యూరో మహా;** వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలు నుండి క్షేత్ర స్థాయి అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సమీక్ష నిర్వహించారు.ఈ సమీక్ష లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూజిల్లాలో వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి, రైతులను ఆరుతడి పంటల సాగువైపు ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తం 1,39,997 ఎకరాల్లో గత సంవత్సరం వరి సాగు అయింది, ఈ సంవత్సరం ఇప్పటివరకు 64,293 ఎకరాల్లో వరి సాగు చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. వరి సాగు చేయాల్సిన మిగిలిన 75,704 ఎకరాల్లో ఇప్పటివరకు 33,438 ఎకరాల్లో మాత్రమే ఆరుతడి పంటలు సాగు చేసినట్లు తెలిపారు. మిగిలిన విస్తీర్ణంలో రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేసేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా ఖానాపురం ప్రాంతంలో పాకాల నీరు అందుబాటులో ఉన్నందున వరి సాగు చేయవద్దని రైతులకు సూచించినప్పటికీ కొందరు రైతులు వరి సాగు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇకపై నీటి లభ్యత, భూసార పరిస్థితులకు అనుగుణంగా ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించాలని ఆదేశించారు. ఇంకా ఆరుతడి పంటలు సాగు చేయని రైతులను గుర్తించి, ఆయా మండలాల వ్యవసాయ విస్తరణ అధికారులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆరుతడి పంటల సాగు లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించేలా మండలాల వారీగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. యూరియా, ఇతర ఎరువులను ఫర్టిలైజర్ యాప్ ద్వారా మాత్రమే కాకుండా ఇతర మార్గాల్లో అక్రమంగా విక్రయించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వ్యవసాయ విస్తరణ అధికారులు తమ పరిధిలోని గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ఆరుతడి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, ఫార్మర్ రిజిస్ట్రీని 100 శాతం పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే పంటల సర్వేను పూర్తి స్థాయిలో త్వరితగతిన పూర్తి చేసి, రైతులకు అవసరమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్ రావు లు వివిధ మండలాల వ్యవసాయ,ఉద్యానవన శాఖ క్షేత్ర స్థాయి అధికారులు పాల్గొన్నారు.



# విశ్వక్ సేన్ 'లెగసీ'పై పెరుగుతున్న అంచనాలు

టాలీవుడ్‌లో విభిన్నమైన కథలు, ఇంటెన్స్ పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. రాజకీయ నేపథ్యంతో తెరకెక్కుతున్న 'లెగసీ' సినిమా షూటింగ్ ప్రస్తుతం తుది దశకు చేరుకుంది. డిసెంబర్‌లో ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.సాయి కిరణ్ రెడ్డి దైదా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కలాహీ మీడియా బ్యానర్‌పై యశ్వంత్ దగ్గుమాటి, సాయి కిరణ్ రెడ్డి దైదా నిర్మిస్తున్నారు. సంజయ్ సాంబ్రాణి, వీవీఎన్ ప్రసాద్ కో ప్రొడ్యూసర్లుగా వ్యవహరిస్తున్నారు.'లెగసీ' అనౌన్స్‌మెంట్ టీజర్ విడుదలైనప్పటి నుంచే సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి మొదలైంది. విమర్శకుల ప్రశంసలు అందుకున్న 'పిండం' తర్వాత కలాహీ మీడియా నుంచి వస్తున్న రెండో ప్రాజెక్ట్ కావడంతో ఈ చిత్రంపై అంచనాలు మరింత పెరిగాయి.అధికారం, కుటుంబం, ప్రేమ, ద్రోహం వంటి అంశాలను కలిపి ఈ కథను రూపొందించినట్లు తెలుస్తోంది. తండ్రి వారసత్వం అనుకోకుండా తన భుజాలపై పడిన ఓ యువ వారసుడు.. ఆ బాధ్యతతో పాటు ఎదురయ్యే సంఘర్షణలను ఎలా ఎదుర్కొన్నాడనే కథాంశంతో సినిమా సాగనున్నట్లు సమాచారం. విశ్వక్ సేన్‌కు సరిపోయే ఇంటెన్స్ పాత్రతో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.

# వరుస అవకాశాలతో యువ నటి జోరు

యువ నటి ప్రిషా సినీ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే దిశగా అడుగులు వేస్తోంది. మోడలింగ్ రంగంలో అనుభవంతో పాటు సినిమాల్లో వరుస అవకాశాలను అందిపుచ్చుకుంటూ బాలీవుడ్, దక్షిణాది చిత్ర పరిశ్రమల్లో తన కెరీర్‌ను మెల్లగా బలోపేతం చేసుకుంటోంది.ప్రిషా 2020లో వచ్చిన హిందీ చిత్రం 'గులాబో సితాబో'తో వెండి తెరపై అడుగుపెట్టింది. అమితాబ్ బచ్చన్ వంటి దిగ్గజ నటుడు నటించిన ఈ సినిమాలో ఆమె ప్రత్యేక పాత్రలో కనిపించింది. చిన్నపాటి స్క్రీన్ అప్పియరెన్స్ అయినప్పటికీ, సినీ పరిశ్రమలో తన ప్రయాణానికి ఈ చిత్రం మంచి ఆరంభంగా నిలిచింది.ఆ తర్వాత ప్రిషా దక్షిణాది సినిమాలపై దృష్టి సారించింది. 2023లో నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'స్పై'లో అవకాశం దక్కించుకుంది. ఈ చిత్రంలో రహ్మాన్ కుమార్తె పాత్రలో కనిపించి తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ తన నటనా సామర్థ్యాన్ని చూపించే ప్రయత్నం చేసింది.2024లో వచ్చిన 'బడ్డీ' సినిమాతో ప్రిషాకు మరింత ప్రాధాన్యం ఉన్న పాత్ర లభించింది. అల్లు శిరీష్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి సామ్ ఆంటోన్ దర్శకత్వం వహించారు. ఇందులో ఆమె ఎయిర్ హోస్టెస్‌గా కనిపించి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ఈ సినిమాతో తెలుగు పరిశ్రమలో తన ఉనికిని మరింత బలపరుచుకునే అవకాశం ఆమెకు లభించింది.ప్రస్తుతం ప్రిషా పలు కొత్త ప్రాజెక్టులతో బిజీగా ఉంది. ఆమె నటిస్తున్నట్లు ప్రకటించిన 'రంభ ఊర్వశి మేనక' చిత్రం 2026లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ద్వారా ఆమెకు మరింత విస్తృతమైన గుర్తింపు లభించే అవకాశం ఉందని సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.మోడలింగ్ నేపథ్యం, సినిమాల్లో వరుస అవకాశాలు, సోషల్ మీడియాలో పెరుగుతున్న ఫ్యాన్ ఫాలోయింగ్ ప్రిషా కెరీర్‌కు మరింత బలాన్ని ఇస్తున్నాయి. నటనతో పాటు తన గ్లామరస్ లుక్స్‌తోనూ ఆమె అభిమానులను ఆకట్టుకుంటోంది. తాజాగా పింక్ కలర్ ఎన్‌సెంబుల్‌లో కనిపించిన ఆమె లుక్ ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. చిరునవ్వుతో కూడిన ఈ స్టైలిష్ లుక్ సోషల్ మీడియాలో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్ వంటి దక్షిణాది చిత్ర పరిశ్రమల్లోనూ అవకాశాలను అందిపుచ్చుకుంటూ ప్రిషా తన కెరీర్‌ను విస్తరించుకుంటోంది. రాబోయే రోజుల్లో మరిన్ని వైవిధ్యమైన పాత్రలు, పెద్ద ప్రాజెక్టుల్లో అవకాశాలు దక్కితే ఆమెకు మరింత గుర్తింపు వచ్చే అవకాశం ఉంది.గ్లామర్, మోడలింగ్ అనుభవం, నటనను కలిపి ముందుకు సాగుతున్న ఈ యువ నటి ప్రస్తుతం సినీ పరిశ్రమలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం కోసం ప్రయత్నిస్తోంది.







# అక్టోబర్‌లో 'రణబాలి' రచ్చ

రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందన్న జంటగా నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. 2026 అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా 'రణబాలి'ని గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. "మన చరిత్రలోని అత్యంత చీకటి అధ్యాయం ఈ అక్టోబర్‌లో తెరుచుకోబోతోంది" అంటూ రిలీజ్ డేట్ ప్రకటించడంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. దీంతో అసలు 'రణబాలి' కథ ఏంటి? చరిత్రలోని ఏ ఘటనను ఇందులో చూపించబోతున్నారు? అనే ప్రశ్నలు ప్రేక్షకుల్లో మొదలయ్యాయి.దర్శకుడు రాహుల్ సంకృత్యన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నతో పాటు హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ కీలక పాత్రలో కనిపించనున్నారు. మైత్రి మూవీ మేకర్స్, టీసిరీస్ సంయుక్తంగా ఈ సినిమాను భారీ స్థాయిలో నిర్మిస్తున్నాయి. గతంలో 'శ్యామ్ సింగరాయ్'తో ప్రత్యేకమైన మేకింగ్‌ను చూపించిన రాహుల్ సంకృత్యన్.. 'రణబాలి'తో మరింత భారీ కాన్వాస్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు తెలుస్తోంది.ఈ సినిమాకు అజయ్‌అతుల్ సంగీతం అందిస్తుండగా, నీరవ్ షా సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. యాక్షన్ సన్నివేశాల కోసం యానిక్ బెన్, ఆండీ లాంగ్ న్గుయెన్ వంటి అంతర్జాతీయ స్టంట్ నిపుణులు పనిచేస్తున్నారు. ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్న ఈ చిత్రం అక్టోబర్ 16, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుందని అధికారిక ప్రకటన రావడంతో విజయ్ దేవరకొండ, రష్మిక అభిమానుల్లో హైప్ మరింత పెరిగింది.



# 'టాక్సిక్' ఎఫెక్ట్ లేదు.. 'ఇరుముడి' హవా

మాస్ మహారాజా రవితేజ నటించిన 'ఇరుముడి' సినిమా బాక్సాఫీస్ వద్ద జోరు కొనసాగిస్తోంది. వీకెండ్‌లో భారీ ఓపెనింగ్స్ సాధించిన ఈ మూవీ.. వర్కింగ్ డేస్‌లోనూ అదే స్పీడ్‌ను చూపిస్తూ కేవలం నాలుగు రోజుల్లోనే రూ.100 కోట్ల మార్క్‌ను దాటినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ప్రాంతీయ చిత్రాల బాక్సాఫీస్ లెక్కల్లో పలు రికార్డులను నమోదు చేస్తూ ముందుకు సాగుతున్న ఈ సినిమా లాంగ్ రన్‌లో మరిన్ని భారీ వసూళ్లు సాధించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.అయితే ఆగస్టు 26న యష్ నటించిన 'టాక్సిక్' భారీ స్థాయిలో విడుదల కావడంతో 'ఇరుముడి'కి తెలుగు రాష్ట్రాల్లో థియేటర్లు తగ్గాయి. దీంతో సినిమా వసూళ్లపై ప్రభావం పడుతుందని ట్రేడ్ వర్గాల్లో చర్చ జరిగింది. ముఖ్యంగా 'టాక్సిక్'కు హిట్ టాక్ వస్తే 'ఇరుముడి' కలెక్షన్లు మరింత తగ్గే అవకాశం ఉందని భావించారు.కానీ ప్రస్తుతం 'టాక్సిక్'కు వస్తున్న టాక్ ప్రకారం పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. 'కేజీఎఫ్' తర్వాత యష్ నుంచి వచ్చిన సినిమా కావడంతో 'టాక్సిక్'పై విడుదలకు ముందే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే ఆ స్థాయి అంచనాలను సినిమా అందుకోలేకపోయిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో 'టాక్సిక్'కు డివైడ్ టాక్ రావడం 'ఇరుముడి'కి అనుకూలంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.





# 'సాహో'పై హీరోయిన్ సంచలన ఛాలెంజ్

సినిమా విడుదలకు ముందే 'సాహో: లైఫ్ ఆఫ్ సంజు' చిత్ర కథానాయిక శ్వేత లక్ష్మణ్ చేసిన ఓ సంచలన వ్యాఖ్య ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా కొత్త సినిమా విడుదలకు ముందు చిత్రబృందం తమ మూవీపై నమ్మకాన్ని వ్యక్తం చేస్తుంటుంది. అయితే శ్వేత మాత్రం తన సినిమా విషయంలో ఏకంగా గుండు కొట్టించుకుంటానంటూ ఛాలెంజ్ చేయడం అందరి దృష్టిని ఆకర్షించింది.సెప్టెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానున్న 'సాహో' ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో శ్వేత లక్ష్మణ్ మాట్లాడారు. ప్రేక్షకులు సినిమా చూడాలని తాను రిక్వెస్ట్ చేయడం లేదని, నేరుగా ఛాలెంజ్ చేస్తున్నానని ఆమె పేర్కొన్నారు. సినిమా చూసిన తర్వాత ఎవరైనా నిరాశకు గురైతే హైదరాబాద్‌లోని అమీర్‌పేట్ సెంటర్‌లో నిలబడి గుండు కొట్టించుకుంటానని సరదాగా, అదే సమయంలో ఎంతో ధీమాగా ప్రకటించారు. ఆమె వ్యాఖ్యలు అక్కడున్న వారిని ఆశ్చర్యానికి గురిచేయడంతో పాటు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.తనకు ఈ కథపై ఎంతో నమ్మకం ఉందని శ్వేత తెలిపారు. సినిమా చూసిన ప్రేక్షకులు కచ్చితంగా ఇది మంచి ప్రయత్నమని చెబుతారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కేవలం సినిమా బాగుందని చెప్పడం కాకుండా, తన నమ్మకాన్ని నిరూపించుకునే స్థాయిలో ఆమె ఈ ఛాలెంజ్ చేయడం ఆసక్తిని పెంచింది.'సాహో' వెనుక భారీ బడ్జెట్ లేదా స్టార్ హీరోలు, పెద్ద తారాగణం లేరని శ్వేత వివరించారు. అయితే మంచి కథపై నమ్మకంతో కొత్త నటీనటులు, సాంకేతిక నిపుణులతో కలిసి ఈ సినిమాను రూపొందించినట్లు చెప్పారు. సినిమా నిర్మాణంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ తమ శక్తిమేరకు కష్టపడ్డారని పేర్కొన్నారు.ప్రేమకథ అంటే కేవలం పాటలు, సరదా సన్నివేశాలకే పరిమితం కాదని శ్వేత అభిప్రాయపడ్డారు. ప్రేమలో భావోద్వేగాలతో పాటు బాధ, త్యాగం, కఠినమైన నిర్ణయాలు కూడా ఉంటాయని తెలిపారు. మనిషి జీవితాన్ని పూర్తిగా మార్చే ఒక కీలక నిర్ణయం చుట్టూ 'సాహో' కథ కొనసాగుతుందని ఆమె వెల్లడించారు. ఈ అంశం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుందని చిత్రబృందం నమ్ముతోంది.ఈ సందర్భంగా చిత్రానికి మద్దతుగా నిలిచిన బన్నీ వాసు, వంశీ నందిపాటికి శ్వేత ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కొత్తవాళ్లు కలిసి రూపొందించిన సినిమాను గుర్తించి తమకు అండగా నిలవడం ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చిందని అన్నారు.అలాగే నిర్మాత తేజేశ్వర్ వెల్పుచర్ల, దర్శకుడు నిశాంత్ దోటి, హీరో శివ కుమార్ కాసారం, సంగీత దర్శకుడు శేఖర్ చంద్రతో పాటు సినిమాకు పనిచేసిన ప్రతి ఒక్కరి కృషిని శ్వేత గుర్తు చేసుకున్నారు. ఈ సినిమా వెనుక దాదాపు 50 నుంచి 60 మంది కొత్తవాళ్ల కలలు, కష్టం ఉన్నాయని చెప్పారు.ప్రేక్షకులకు సినిమా అందుబాటులో ఉండేలా మంచి థియేటర్లలో, సరసమైన టికెట్ ధరలతో విడుదల చేయాలని ప్రయత్నిస్తున్నట్లు చిత్రబృందం తెలిపింది. శివ కుమార్ కాసారం, శ్వేత లక్ష్మణ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి నిశాంత్ దోటి దర్శకత్వం వహించారు. సుమైరా స్టూడియోస్ బ్యానర్‌పై తేజేశ్వర్ వెల్పుచర్ల నిర్మించగా, శేఖర్ చంద్ర సంగీతం అందించారు.సినిమా విడుదలకు ముందు తన చిత్రంపై శ్వేత వ్యక్తం చేసిన నమ్మకం ఇప్పుడు 'సాహో'పై ఆసక్తిని మరింత పెంచింది. సాధారణ ప్రచారానికి భిన్నంగా ఆమె చేసిన గుండు ఛాలెంజ్ ఎంతవరకు నిజమవుతుందో తెలుసుకోవాలంటే సెప్టెంబర్ 4 వరకు వేచి చూడాల్సిందే.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com